UESI
ANDHRA PRADESH

Rs. 12/- per copy

# విద్యార్థి జ్వాల

Vol. 29 - No.10

August 2023



## వ్యక్తిగత సువార్త

ఎడిటోరియల్

# మన తోటివారికి చేసే మేలు

ఓ రాత్రి సమయంలో ఒక అపార్ట్‌మెంట్‌కు నిప్పు అంటుకొన్నప్పుడు అందులో ఉన్న ఒక వ్యక్తికి మెలకువ వచ్చింది. అప్పుడు తన ప్రాణాన్ని కాపాడుకోవడానికి ఒక్కడు మాత్రమే గబగబా బయటకు పరుగెత్తుకొని వస్తే అతడు సామాజిక బాధ్యతలేని స్వార్థపరుడవుతాడు. కానీ అలాకాకుండా, వెంటనే అతడు తన అపార్ట్‌మెంట్‌లో ఉన్న అందరికీ వినబడేటట్లు "ఈ అపార్ట్‌మెంట్‌కు నిప్పు అంటుకుంది అందరూ బయటకు రండి" అని గట్టిగా అరుస్తూ హెచ్చరిస్తే సాటి మనిషిపట్ల నైతిక బాధ్యత ఉన్నవాడు అవుతాడు. ఎందుకంటే అగ్నికి ఆహుతి అయ్యేవారిని హెచ్చరించి కనీసం కొంతమందినైనా కాపాడాలని అతని ప్రయత్నం. అలాకాకుండా ఎవరు ఎలా పోతే నాకెందుకు నన్ను నేను కాపాడుకొంటే సరిపోతుందిలే అని ఎవరూ అనుకోరు, అలా అనుకొని తనను మాత్రమే రక్షించుకొని బయటకు వస్తే దానికి మించిన అపరాధం మరొకటి ఉండదు.

మేలైనది చేయడం తెలిసి చేయకపోతే పాపం అని బైబిల్ చెబుతుంది (యాకోబు 4:17). నశించిపోయే మానవాళికి, చనిపోయిన తర్వాత నిత్యాగ్నికి పరుగులెత్తుతున్న వారికి దానిని తప్పించుకొనే మార్గం క్రీస్తే అని తెలిసి కూడా ఆ శుభవార్తను ప్రకటించకపోతే మనం పాపం చేస్తున్నట్లే. విశ్వాసులంగా మనతోటి వారికి చేయాల్సిన గొప్ప మేలు సువార్తను ప్రకటించడమే. అగ్నిలోనుండి లాగినట్టు 'కొందరినైనా రక్షించడమే' (యూదా 1:23).

"సువార్త నిజంగా శుభవార్త అని మనం నమ్మితే తోటివారికి చెప్పకుండా ఉండలేము, ఖాళీగా కూర్చోలేము, సాకులు చెప్పలేము. వారు రక్షణ పొందే వరకు అపొస్తలుడైన పౌలువలె ప్రార్థిస్తూ, ప్రయాసపడతాము. ఎందుకంటే సువార్త నిత్యత్వంతో ముడిపడి ఉంది. సువార్త ప్రకటన అనేది మనం ఇష్టపడితే చేసేది కాదు. అది దేవుని పిల్లలందరికీ దేవుడు ఇచ్చిన ఒక ఆజ్ఞ, బాధ్యత కూడా (మార్కు 16:15). గనుక మన తోటివారితో సువార్తను పంచుకోవాలనే ప్రగాఢమైన వాంఛ మనకు ఉండాలి. ఈ క్రమంలో మనకు అనేక అవాంతరాలు, వ్యతిరేకత ఎదురవ్వొచ్చు. "క్రీస్తు సువార్తను, బోధను తిరస్కరించడానికి ప్రజలు ఎంత గట్టి తీర్మానం తీసుకొంటారో, దైవ సేవకులు అంతే గట్టిగా తృష్ణతో, ఆకాంక్షతో, పట్టు విడవకుండా, తమ శక్తి వంచన లేకుండా ఎంతో జాగ్రత్తతో సాతాను దాడులను నిర్వీర్యం చేస్తూ సత్య సువార్తను ప్రకటించాలని" జాన్ కాల్విన్ అంటాడు.

సువార్తను ప్రకటించే విషయంలో అపొస్తలుడైన పౌలు తీర్మానాలు చాలా గొప్పవి. "గ్రీసు దేశస్థులకును గ్రీసుదేశస్థులు కాని వారికిని, జ్ఞానులకును మూఢులకును నేను ఋణస్థుడను, నావలనైనంతమట్టుకు...సువార్త ప్రకటించుటకు సిద్ధంగా ఉన్నాను, సువార్తను గూర్చి నేను సిగ్గుపడువాడను కాను" (రోమా 1:14-16), సువార్త ప్రకటించాల్సిన భారం నామీద మోపబడియున్నది, సువార్తను ప్రకటించకపోయిన యెడల నాకు శ్రమ (1 కొరింథీ 9:16) అని చెబుతాడు. పౌలుకు సువార్త ప్రకటించకపోతే శ్రమ. మనకు సువార్త ప్రకటించడమే శ్రమ. సువార్త విషయంలో పౌలు కి హృదయంలో గొప్ప వేదనతో అప్పటికే తెలిసిన భూభాగం అంతటికి సువార్తను ప్రకటించాడు. సువార్తను ప్రకటించే వారు లేకుండా ప్రజలు ఎలా వింటారు, విశ్వసిస్తారు, ప్రార్థిస్తారు, రక్షణ పొందుతారని ప్రశ్నిస్తూ, సువార్త ప్రకటించే వారి పాదములు ఎంతో సుందరములు అని కితాబిచ్చాడు (రోమా 10:14,15).

సువార్త విలువనెరిగిన డేవిడ్ బ్రైనార్డ్, డేవిడ్ లివింగ్‌స్టన్, హడ్సన్ టేలర్, సి.టి.స్టడ్, అదోనిరామ్ జడ్సన్, జిమ్ ఇలియట్, డియల్ మూడి, విలియమ్ కేరి, సాధు సుందర్ సింగ్, పండిత రమాబాయి, బిల్లీ గ్రాహం, భక్త సింగ్ లాంటి గొప్ప భక్తులు ప్రపంచ వ్యాప్తంగా సువార్తను మోగించారు. సువార్తకే తమ జీవితాలను అంకితం చేసుకొని జీవించారు. సువార్త కొరకే చనిపోయారు.

విద్యార్థుల మధ్య సువార్త ప్రకటించాలనే దైవ దర్శనానికి లోబడి, ప్రొ. ఇనాక్, డా. స్ట్రెరట్, జాన్ మూడీ, డేవిడ్ సిసి వాట్సన్, పిటి చాందపిళ్ళ, పి.సి. వర్గీస్, సత్మూర్తి రావు, జోసఫ్ అభిషేకరావు మొదలైనవారు యుఇయస్ఐ పరిచర్యకు తమ జీవితాలను అంకితం చేసుకొని గొప్ప సమర్పణతో పనిచేశారు.

సువార్తను ప్రకటించే విషయంలో, ముందుకు తీసుకెళ్ళే విషయంలో మన సమర్పణ ఎలా ఉంది? "ఆసక్తి" అనే మాట 'జెలస్' అనే గ్రీకు పదం నుండి వచ్చింది. దాని అర్థం 'ఉడుకుట, వేడిగా ఉండుట". సువార్తను ప్రకటించే విషయంలో మనం చల్లగా ఉన్నామా? నులివెచ్చగా ఉన్నామా? లేక దేవుని కొరకైన ఆసక్తితో మండుతూ ఉన్నామా?

– పి. సునీల్ జాకబ్

# విద్యార్థి జ్వాల



Vol. 29, No.10 August 2023
A Publication of
UESI Publication Trust





EDITORIAL BOARD:

Mr. B.J. Lazarus, Honorary Editor
Mr. P. Sunil Jacob - Editor
Dr. J. Ratna Grace - Member
Dr. M. Solomon Raju - Member
Mrs. K. Martha - Member
Mr. B. Jason - Member
Mr. G. Leela Narayana - Member
Mr. K. Adam - Sec., Litt.Dept.



CONTACT:

The Editor, Vidyarthi Jwala,
UESI-AP - Study Centre, # 19-37,
Abhishek Nagar, Nambur - 522 508
Ph: 0863-2293319, 9299997087
Email: editorvj@gmail.com



GIFTS & SUBSCRIPTIONS:

Can be made by Cheque/DD/MO
in favour of UESI-AP,
Abhishek Nagar, Nambur - 522 508

ANNUAL: GRADUATES - Rs.250
STUDENTS - Rs. 120
LIFE INLAND - Rs. 2000
LIFE OVERSEAS - US $ 150

VIDYARTHI JWALA ACCOUNT NO:

**SBI - 36698741798**
**IFS Code: SBIN0011994**
**uesiap vj, Nambur Branch**

GENERAL CONTRIBUTIONS ACCOUNT NO:

**SBI - 10949477628**
**IFS Code: SBIN0000844**
**Commercial Branch, Guntur**

LITERATURE ACCOUNT NO:

**SBI - 36698741437**
**IFS Code: SBIN0011994**
**uesiap pt, Nambur Branch**

**Please inform/ SMS to**
**Mr. A. Venu, Accountant (9849516060)**
**Email: <uesiapacc84@gmail.com>**

TOPICS:

September: Unity
October: Power through Prayer
November: Fear of God
December: The Uniqueness of Jesus Christ

**Note:** Please send your writeups on or before
**10th of every month**


## మణిపూర్ కోసం ప్రార్థిద్దాం

క్రైస్తవులు పరిశుద్ధంగా జీవిస్తే లోకస్తులకు అసూయాద్వేషాలు రగులుతాయి. ఎందుకంటే ఈ గొప్ప సద్గుణము వారిలో లేదు కాబట్టి. లోకం తన భక్తిహీనతను, విచ్చలవిడితనాన్ని కప్పిపుచ్చుకోవడానికి, వారి మార్గం సరైనదని చెప్పకోవడానికి క్రైస్తవుల్ని ద్వేషిస్తూ, దాడులు చేస్తూ, హింసిస్తూ విమర్శనాస్త్రాలు ఎక్కు పెడతారు. ఈ మానసిక ఒత్తిళ్ళు భరించలేక క్రైస్తవులు కూడా వారితో కలిసిపోవాలన్నది సాతాను యొక్క అసలు లక్ష్యం.

## లోపలి పేజీల్లో...


- మన తోటివారికి చేసే మేలు - 2
- శక్తిని పొందుకొందాం- 4
- వ్యక్తిగత సువార్త - 5
- పట్టభద్రుడా పనిచేస్తావా పల్నాడు కోసం - 7
- సువార్త మన జీవనశైలి కావాలి - 8
- సువార్తకు శత్రువులు - 11
- సమరయ స్త్రీ - 14
- థియాలజీలోని విభాగాలు - 15
- ఆదాము - 18
- కుటుంబంగా కలిసి సేవ చేద్దాం - 20
- మనోవేదనలో మువ్వన్నెల జెండా- 22
- గురిలేని జీవితం - 23
- పండిత రమాబాయి - 26
- నిజమైన స్వాతంత్ర్యం- 28
- చింతించడం - 30
- కోశాధికారి లేఖ - 31
- ఇంకెందుకు ఆలస్యం?- 32

# శక్తిని పొందుకొందాం

"ఆధ్యాత్మిక శక్తి లేకుండా ఆధ్యాత్మిక పని చేయడానికి ప్రయత్నించినప్పుడు మనం ఘోరంగా విఫలమవుతాం" అని అంటారు గొప్ప అమెరికన్ పాస్టర్ మరియు రచయిత, ఏ. డబ్ల్యు. టోజర్.

అద్వితీయుని – అభిలాష, సర్వోన్నతుని – స్వప్నం, పరమ తండ్రి – ప్రణాళిక నెరవేరాలంటే మనం ఆరోగ్యంగా ఉండాలి. మన ఆరోగ్యం మహోన్నతుని మనసు తెలుసుకోవడం ద్వారా ఆయన మాటను ఆహారంగా చేసుకోవడం ద్వారా లభిస్తుంది. మనుష్యుడు రొట్టెవలన మాత్రం కాదు గాని దేవుని నోట నుండి వచ్చు ప్రతి మాట వలన జీవించును. అంటే దేవుని మాటను జీవితంలో ప్రధానమైనదిగా ఎంచి, మన ప్రాధాన్యతలను సరి చేసుకోవాలి.

పవిత్ర లేఖనాల పఠనం మనల్ని పరిశోధించి, పవిత్రీకరించి, ప్రకాశింపచేసి, ప్రగతి పథంలో నడిపించాలి. ప్రపంచ అధినేతలను మన ప్రయోగాత్మక జీవితం ద్వారా ప్రభావితం చేయాలి. ప్రభువుకు ప్రతినిధులుగా, ప్రతిబింబాలుగా, ప్రవక్తలుగా మనల్ని తీర్చిదిద్దాలి.

సరళమైన సువార్త సత్యాన్ని సమాజానికి సంతృప్తికరంగా /సమృద్ధిగా అందించాలంటే ఆధ్యాత్మిక సామర్థ్యం చాలా అవసరం. ఈ సామర్థ్యాన్ని సంపాదించడానికి ఒకే ఒక ప్రధాన మార్గం బైబిల్‌ను క్రమంగా చదవడం, ధ్యానించడమే.



విశ్వాసులు తగినంత ఆత్మీయ ఆరోగ్యం కలిగి ఉండకపోవటానికి ఒక ప్రధానమైన కారణం ప్రభువు ఆశించిన మోతాదులో బైబిల్‌ని చదివి, పాటించకపోవడమే.

బైబిల్లోని 66 గ్రంథాలు లేనప్పుడు కేవలం పరిమితమైన పుస్తకాలు మాత్రమే అందుబాటులో ఉన్నప్పుడు ఎజ్రా, యెహోవా ధర్మశాస్త్రమును పరిశోధించి దాని చొప్పున నడుచుకోవడానికి, ఇశ్రాయేలీయులకు దాని కట్టడలను విధులను నేర్పడానికి దృఢ నిశ్చయం చేసుకొన్నాడు. బైబిల్ చదవడానికి ఇష్టం, శ్రద్ధ లేనివారు ఆయన కార్యాల్లో విజయాన్ని సాధించలేరు. దేవుని ఉద్దేశం నెరవేర్పుకు దేవుని ప్రజల ఆశీర్వాదానికి రహస్యం బైబిల్‌ని చదవడం అని గుర్తించి దానినే ప్రాధాన్యతగా చేసుకొని దానియందు ప్రవీణత సాధించాడు. తన ప్రావీణ్యత తన ప్రయోగాత్మక జీవితంలో ప్రస్ఫుటంగా ప్రభుత్వాలకు, ప్రభువులకు, పరిపాలకులకు, ప్రస్ఫుటంగా కనిపించేలా జీవించాడు. ఈ సత్యం మనల్ని కూడా ఎజ్రాలా జీవించడానికి ప్రోత్సహించాలి. ప్రస్తుత కాలంలో అలా జీవించేందుకు మనం కూడా పరిశ్రమించాలని ప్రతిజ్ఞ చేద్దాం.

తన జీవితంలో వ్యక్తుల్ని క్రీస్తు ప్రేమకు పరిచయం చేసి వారిని క్రీస్తు స్వరూపంలోకి మార్చడానికి విశ్వ ప్రయత్నం చేసిన ప్రముఖుల్లో ఒకరు జాన్ స్టాట్ (ప్రపంచవ్యాప్త ఐయఫ్ఇయస్ రాయబారి). ఇలా ఉండడానికి తనను బలపరిచిన అంశాలు – క్రమమైన వాక్య ధ్యానం, ధ్యానంలో దేవుడు నేర్పిన విషయాలను అనుదిన జీవితంలో పాటించడమే.

ఈ ఆగస్ట్, సెప్టెంబర్ నెలలు ప్రభువు ప్రేమను పరిచయం చేయడానికి మనకు ప్రాముఖ్యమైనవిగా ఉన్నాయి. విద్యార్థులకు ఆయన ప్రేమను పరిచయం చేయాలన్నా, పరిచయం చేసిన తర్వాత వారిని పరిణతి చెందిన వారిగా తీర్చిదిద్దాలన్నా మన పాత్ర కీలకం. వీటిని ఆచరించడంలో మన ఆధ్యాత్మిక శక్తిని పరిపూర్ణంగా వినియోగిద్దాం. వినియోగానికి ముందు ఆధ్యాత్మిక శక్తిని సంపాదిద్దాం. ఎందుకంటే ఆధ్యాత్మిక శక్తి లేకుండా ఆధ్యాత్మిక పని చేయడానికి ప్రయత్నించినప్పుడు మనం ఘోరంగా విఫలమవుతాం. మన జీవితం విఫలమవ్వడానికి కాదు గాని అంతిమ విజయానికే. వ్యక్తుల్ని యేసయ్య ప్రేమకు పరిచయం చేసి వారిని ఆయన స్వారూప్యంలోకి తీర్చిదిద్దడమే అసలైన విజయం. అదే మన అంతిమ ధ్యేయం.

ఆయన ప్రణాళికలో మీ....

ఆర్. శ్రీనివాస్
యుఐయస్ఐ–ఏపి స్టేట్ సెక్రటరీ, గుంటూరు



# వ్యక్తిగత సువార్త

## క్రీస్తును గూర్చి చెప్పడానికో గొప్ప అవకాశం

*మీరు సర్వలోకానికి వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి. మార్కు 16:15.*

క్రైస్తవ్యం ప్రార్థించే ప్రపంచాన్ని చేరాలన్నా, అందరూ రక్షణ పొంది సత్యాన్ని గూర్చిన అనుభవజ్ఞానం కలవారై ఉండాలనే మాట (1 తిమోతి 2:4) నెరవేరాలన్నా వ్యక్తిగత సువార్తీకరణ అనేది ఒక శక్తివంతమైన సాధనము, ఒక ప్రత్యేకమైన పిలుపు అని గుర్తించాలి. ఈ డిజిటల్ యుగంలో ఇతరులతో వ్యక్తిగతంగా సమయం గడపడం ఒక సవాలుగా మారింది. అయితే క్రీస్తు అనుచరులుగా ఇతరులతో సువార్త పంచుకొనే విలువైన బాధ్యత మనకు అప్ప గింపబడింది. యుఇయఎస్ఐకు దేవుడిచ్చిన మొదటి లక్ష్యం సౌవార్తీకరణ. ప్రభువైన యేసుక్రీస్తు గూర్చి మన దేశంలోని విద్యార్థులకు తెలియజేయడమే మన మొదటి కర్తవ్యం. వ్యక్తిగత సువార్త అనేది కేవలం ఒక పని కాదు, గానీ మానవాళి కోసం దేవుని విమోచన ప్రణాళికలో పాల్గొనడం. దేవదూతలకు కూడా లేని గొప్ప ఆధిక్యతను దేవుడు మనకు ఇచ్చాడు. నశించిపోతున్న వ్యక్తులను రక్షించడం కంటే గొప్పదైన సంతోషం మరొకటి లేదు. సువార్త పనికి చాలా మార్గాలున్నా వ్యక్తిగత సౌవార్తీకరణ వాటిలో చాలా ప్రాముఖ్యమైనది, సులువైనది, తక్కువ ఖర్చుతో కూడుకొన్నది, ఏ సమయంలోనైనా, ఏ ప్రదేశంలోనైనా పని చేస్తుంది. మనలో ప్రతి ఒక్కరూ చేయగలిగినది. నశించిన విద్యార్థులను సంపాదించడానికి ఇది మన పరిచర్యకు పటిష్టమైన పద్ధతి.

### వ్యక్తిగత సువార్త అంటే?

నీ తోటివారితో యేసుక్రీస్తును రక్షకుడని, ప్రభువని, దేవుడని నీ జీవితం ద్వారా లేదా పెదవులతో ఆత్మశక్తితో పంచుకోవడం ద్వారా క్రీస్తును నమ్మి వెంబడించేటట్లు చేయడం అని ఆర్.ఎ.టోరి అంటాడు. ఒక్కొక్కరిని క్రీస్తు వద్దకు తీసుకొని రావడం (యోహాను 1:40-42). ఇది పరిశుద్ధాత్మ సహాయంతో ప్రార్థనాపూర్వకంగా ఒక పాపి యేసుక్రీస్తును రక్షకునిగా, ప్రభువుగా స్వీకరించే సజీవమైన బంధంలోనికి నడిపించే ప్రక్రియ. డి.టి. నీలస్ అన్నట్లు వ్యక్తిగత సువార్త అంటే ఒక భిక్షగాడు మరొక భిక్షగానికి భోజనం ఎక్కడ దొరుకుతుందో చెప్పడం.

### వ్యక్తిగత సువార్త - ప్రాముఖ్యత

వ్యక్తిగత సువార్త అనేది ఎంపిక చేసిన కొంతమంది చేసే పని మాత్రమే కాదు. ఇది ప్రతి విద్యార్థి, గ్రాడ్యుయేట్, స్టాఫ్‌కు దేవుడిచ్చిన పిలుపు. పీటర్ బౌలర్, ఎడ్వర్డ్ కింబాల్, జాన్ ప్రివెంట్‌లు బహుశా మనలో చాలామందికి తెలియకపోవచ్చు. కానీ వారు వ్యక్తిగత సువార్త ద్వారా నడిపించిన జాన్‌వెస్లీ, డి.యల్.మూడీ, బిల్లీగ్రాహం లాంటి గొప్ప సేవకులు నేటి ప్రపంచానికి ఎంతో సుపరిచితులు. క్రైస్తవ జీవితంలో గొప్ప విషాదం మరణం కాదు, లక్ష్యం లేని, ఇతరుల ఆత్మల పట్ల భారం లేని జీవితమే.

### ఇది క్రీస్తు ఆజ్ఞ

దేవుడు మనకు ఇచ్చిన మిషన్ – వ్యక్తిగత సువార్త. సర్వలోకానికి సువార్త ప్రకటించమని (మార్కు 16:15), సమస్త జనులను శిష్యులుగా చేయమని (మత్తయి 28:19-20) యేసు ఆజ్ఞాపించారు. ఈ ఆజ్ఞకు లోబడడం ద్వారా అనేకమంది జీవితాల్లో నిరీక్షణ నింపుతూ, వెలుగును పంచుతూ లెక్కలేనన్ని జీవితాలను దేవుని వైపుకు నడిపించగలము.

### ఇది దేవుని ప్రేమ

క్రీస్తు ప్రేమ మనల్ని వ్యక్తిగత సువార్త చేసేలాగా ఆయన కొరకు జీవించేలాగా బలవంతం చేస్తుంది (2 కొరింథీ 5:14). యోహాను 3:16లో చెప్పినట్లుగా దేవుని ప్రేమ మనలో ఉంచుకోవడానికి కాదు పంచుకోవడానికి ఉద్దేశించబడింది. దు:ఖాన్ని మనలో దాచుకోగలమేమో గానీ దేవుడు మన జీవితంలో ఇచ్చిన సంతోషాన్ని దాచలేం.

### ఇది మన భారం

నశించిపోతున్న ఆత్మల పట్ల భారం, యేసు ఇచ్చే నూతన జీవితం ఇతరులు అనుభవించాలనే ప్రగాఢమైన కోరిక మనం వ్యక్తిగత పరిచర్యలో నిమగ్నమయ్యేలా చేస్తుంది. యెహెజ్కేలు ఇశ్రాయేలీయులకు కాపలా దారునిగా నియమించబడినట్లే ఇతరులతో ప్రభువు గూర్చి పంచుకొనే బాధ్యత, భారం మనపై ఉంది (యెహెజ్కేలు 33:7). ఆత్మల పట్ల మనకున్న భారం జీవితాన్ని మార్చే యేసు సందేశాన్ని ఇతరులతో పంచుకొనేలా ప్రేరేపిస్తుంది.

### ఇది ప్రతి వ్యక్తి అవసరత

సువార్త ప్రతి మానవునికి కీలకమైన అవసరం. ఇది హృదయ అవసరాలను తీరుస్తుంది. క్షమాభిక్ష పెడుతుంది. దేవునితో ఒక మంచి సంబంధాన్ని, జీవితానికి ఒక ఉద్దేశాన్ని తీసుకొని వస్తుంది. అవసరంలో ఉన్న వ్యక్తికి సహాయం చేయగలిగి కూడా చేయలేకపోతే దేవుని దగ్గర మెప్పు పొందలేము. యేసుక్రీస్తు ద్వారా దేవుని బహుమానమైన నిత్యజీవాన్ని పొందే అవకాశాన్ని ఎవరూ కోల్పోకుండా సువార్తను వ్యాప్తి చేయడంలో శ్రద్ధ కలిగి ఉందాం (రోమా 10:14-15).

## యేసుక్రీస్తు - వ్యక్తిగత సువార్త

వ్యక్తిగత సువార్తికునిగా యేసుప్రభువు అత్యుత్తమ ఉదాహరణ. ఆయన తప్పిపోయిన ఆత్మల పట్ల కనికరాన్ని, ప్రేమను చూపించారు. సమయాన్ని సద్వినియోగం చేసుకొంటూ ప్రతి అవకాశాన్ని వ్యక్తిగత పరిచర్యకై వాడుకొన్నారు. ఆయన సమరయ స్త్రీకి వ్యక్తిగతంగా సువార్త ప్రకటించిన సందర్భంలో కొన్ని విషయాలు గమనిద్దాం (యోహాను 4:4-30).

> “
> గడియారంలో సెకన్ల ముల్లు వేగంగా కదులుతుంది. గడిచే ప్రతి క్షణం నిత్యత్వం దగ్గరికి ఒక్కరినైనా తీసుకొని రావాలి. ఆలస్యం కాకముందే సువార్త సందేశాన్ని పంచుకొందాం. ఎవరి కోసం వేచి ఉండవద్దు. దేవుడిచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొంటూ ఒంటరిగా ఒక్కొక్కరిని చేరుకొందాం.

**1. సరైన సంభాషణ:** యేసు సమరయ స్త్రీ జీవితంలోని సమస్యలపై ఆసక్తిని కనపరుస్తూ సంభాషణ ప్రారంభించారు. వ్యక్తిగత సువార్తలో వ్యక్తులతో సరైన సంబంధాలు ఏర్పరచుకోవడం, వారి మాటలు వినడం, వారి అవసరాలు అర్థం చేసుకోవడం చాలా ప్రాముఖ్యమైన విషయం.

**2. తప్పిపోయిన వారి పట్ల కనికరం (యోహాను 4:7,9):** యేసు అలసిపోయినప్పటికి, దాహంతో ఉన్నప్పటికి, ఆమెతో సంభాషణలో పాల్గొనడం ద్వారా సమయర స్త్రీ పట్ల కనికరం చూపించారు. ఆధ్యాత్మికంగా నష్టపోయిన వారి పట్ల నిజమైన శ్రద్ధ చూపించడం ద్వారా వ్యక్తిగత సువార్త ప్రారంభం అవుతుందని ఆయన నిరూపించారు.

**3. అడ్డంకులు తొలగించడం (యోహాను 4:9,27):** యేసుకు సమరయ స్త్రీకి మధ్య సాంస్కృతిక మరియు సామాజిక అడ్డంకులు ఉన్నప్పటికి వాటన్నిటిని విస్మరించి వ్యక్తికి ఆయన ప్రాముఖ్యత ఇచ్చారు. సత్యాన్వేషకులను చేరడానికి ప్రతి అడ్డంకి తొలగించాల్సిన అవసరత ఉంది.

**4. అవసరాలను గుర్తించడం (యోహాను 4:10-14):** సమరయ స్త్రీ యొక్క భౌతిక మరియు ఆధ్యాత్మిక అవసరాలను పరిష్కరించడానికి యేసు జీవజలము అనే అంశాన్ని ప్రస్తావించారు. ప్రభావవంతమైన వ్యక్తిగత సువార్తలో వ్యక్తుల అవసరాలను గుర్తించడం, వాటికి సువార్తలో కనుగొనబడిన పరిష్కారాన్ని అందించడం ఇమిడి ఉందని ఆయన చూపించారు.

**5. పాపం గూర్చి ప్రస్తావించడం (యోహాను 4:6-18):** యేసు, స్త్రీ యొక్క వ్యక్తిగత జీవిత పరిస్థితిని ప్రస్తావించారు. ఆమె పాపాన్ని సున్నితంగా పరోక్షంగా ప్రస్తావించారు. వ్యక్తిగత సువార్తలో వ్యక్తిగత పరిస్థితులను, వారి జీవన శైలిని, వారి స్థితి అర్థం చేసుకొని మాట్లాడడం అవసరం.

**6. సరైన సమయంలో యేసును గూర్చి ప్రస్తావించడం (యోహాను 4:25-26):** యేసు సరైన సమయంలో తనను తాను మెస్సీయగా వెల్లడించాడు. తద్వారా ఆ స్త్రీ యేసును రక్షకునిగా అంగీకరించింది. వ్యక్తిగత సువార్తలో మానవాళి రక్షణార్థం యేసు చేసిన సిలువ కార్యాన్ని, ప్రణాళికను ప్రస్తావించి, అన్వేషకులు పశ్చాత్తాపపడి ప్రభువును అంగీకరించేలా పరిశుద్ధాత్మ సహాయంతో ప్రోత్సహించాలి.

యేసు సమరయ స్త్రీతో సంభాషించినట్లే ప్రేమతో, దయతో సువార్తను పంచుకునే బాధ్యత మనపై ఉంది. ఇది వాక్చాతుర్యం గురించి కాదు, ఇతరుల పట్ల మనకున్న ప్రేమ, భారం, శ్రద్ధ మనల్ని వ్యక్తిగత సువార్త చేసేలా పురిగొల్పుతుంది. వ్యక్తిగత సువార్త కేవలం మాటలు మాత్రమే కాదు ప్రతిరోజు క్రీస్తు ప్రేమను పంచుకునే జీవన విధానం. కొందరు అవిశ్వాసులు కూడా చదవగలిగిన ఏకైక బైబిల్ మన జీవితం మాత్రమే.

## ముగింపు

గడియారంలో సెకన్ల ముల్లు వేగంగా కదులుతుంది. గడిచే ప్రతి క్షణం నిత్యత్వం దగ్గరకు ఒక్కరినైనా తీసుకుని రావాలి. ఆలస్యం కాకముందే సువార్త సందేశాన్ని పంచుకొందాం. ఎవరి కోసం వేచి ఉండవద్దు. దేవుడిచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఒంటరిగా ఒక్కొక్కరిని చేరుకొందాం. మన జీవితంలో ప్రతిరోజు క్రీస్తు ప్రేమను, నిరీక్షణను పంచుకోవడానికి ఒక అవకాశం. మనము ఈ లోకంలో విజయవంతులుగా ఉండడానికి పిలవబడలేదు కానీ విశ్వాసులుగా ఉండడానికి, క్రీస్తు సువార్తను పంచుకోవడానికి పిలవబడ్డాం. భయపడకుండా, సిగ్గుపడకుండా, ప్రభువు ఆజ్ఞకు లోబడుతూ, పరిశుద్ధాత్ముని సహాయంతో వ్యక్తిగత సువార్తలో పాల్గొందాం. మనం ఎవరికైనా ఇవ్వగలిగే గొప్ప బహుమానం సువార్త మాత్రమే.

– **యం.బాబి,** హైదరాబాద్

కవిత




## పట్టభద్రుడా పనిచేస్తావా పల్నాడు కోసం

పలచనైపోయింది పరిచర్య
పని విస్తారం పనివారు కొంచెం
పరితపిస్తుంది ప్రభు ప్రాణం
పల్నాడు కోసం

పడిపోయిన ప్రాకారాలను
ప్రార్థనతో కట్టిన నెహెమ్యాలా
ప్రతికూల పరిస్థితుల్లో
ప్రభువు కోసం నిలబడిన
దానియేలులా

పాపముతో పతనమవుతున్న
పదహారేళ్ళ యువత కోసం
పనిచేస్తావా, పట్టభద్రుడైన
లూకా వలే

పల్నాడు పౌరుషాల గడ్డని
అపవాదికిది విగ్రహాలఅడ్డాని
వ్యతిరేకుల చేతిలో నుంచి
విద్యార్థులను విడిపించడానికి
భయపడకు గిద్యోను వలె

పల్నాడు పనిష్మెంట్ ప్రాంతమని
ప్రయాసపడినా ఫలితం లేదని
పైసలు ఖర్చుపెట్టినా ఫలము లేదని
పట్టు విడవకు
ఫాదర్ హయ్యర్ వలె

పట్టభద్రులారా పనిచేద్దాం
పరిచారకుల వలె
ప్రార్థనచేద్దాం ప్రభువు వలె
ప్రయాసపడదాం మనపూర్వీకులు వలె
పంచుకుందాం పల్నాడుని
పౌలు బర్నబాల వలె

– **ముత్తయ్య (స్టీఫెన్)** పల్నాడు ఆర్డీసి, గురజాల



# సువార్త మన జీవనశైలి కావాలి

రెండు తెలుగు రాష్ట్రాలలోని బ్రదరన్ అసెంబ్లీస్‌లో జి.రాజారావుగారు అంటే తెలియనివారు ఉండరు. చదివింది 5వ తరగతే అయినా దేవుని కృపను బట్టి బైబిల్‌లోని 66 పుస్తకాలకు వ్యాఖ్యానాలుగా 94 పుస్తకాలు రాశారు. తన పరిచర్య ద్వారా తిమ్మసముద్రం, పరిసర 11 గ్రామాల్లో సంఘాలు కట్టారు. ఇతర రాష్ట్రాల్లో, దుబాయ్‌లో విరివిగా వాక్య పరిచర్య చేశారు. 11 ఏప్రిల్ 2012 న ఆయన పరలోక పిలుపును అందుకున్నారు.

రాజారావు గారి తల్లి కోటమ్మ ప్రతిరాత్రి పిల్లల కోసం ప్రార్థించాకే నిద్రపోయేది. మళ్ళీ తెల్లవారుజామునే తన పిల్లల కోసం ప్రార్థించేది, సందర్భాన్ని బట్టి సువార్తను చెబుతూ ఉండేది.

ఒక రోజు సాయంత్రం కోటమ్మ పొయ్యిమీద అన్నం వండుతోంది. చిన్న చిన్న పుల్లలు, ఒక పెద్ద పుల్లను ఆసరా చేసుకొని మంట వెలుగుతుంది. అప్పుడే బయటనుండి వచ్చిన రాజారావుగారు అమ్మ పక్కనే కూర్చొని మంటలోకి తదేకంగా చూస్తున్నాడు. అమ్మ మళ్ళీ మరో పుల్లను పెట్టింది. మంట ఇంకాస్త పెద్దదయింది. మంటను చూస్తున్న కొడుకుతో ఏం మాట్లాడాలి ప్రభువా?అని మనసులో ప్రార్థించుకొంటూ...

"రాజా..."

ఊ"

"ఆ మంట చూశావా? రక్షణ లేకుండా రేపు నువ్వు చచ్చిపోతే అలాంటి మంటల్లోకే వెళ్తావు. ఈ మంట కొంతసేపటికి ఆరిపోద్ది గానీ ఆ మంట ఎప్పటికీ ఆరదు" ఆ మాట పలుకుతున్నప్పుడు ఆమె స్వరంలో నశించే ఆత్మ కొరకైన దు:ఖం ధ్వనించింది.

రాజా ఒళ్ళు జలదరించింది...ఆ! అన్నాడు.

"అవును"

"నువ్వు మారాలి, లేకపోతే నిరంతరం అగ్ని మంటల్లో కాల్తూనే ఉండాలి"

ఈ మాటలు రాజారావుగారి చెవుల్లో గింగురు మంటూ రక్షణ పొందడానికి నాంది పలికాయి.

రక్షణ లేనివారు మన ఇంట్లో, కాలేజ్‌లో, హాస్టల్లో మన చుట్టూ ఎంతోమంది ఉన్నారు. విశ్వాసులమైన మనం వారిని చూసినప్పుడు నశించిన ఆత్మల కొరకైన దు:ఖం రావాలి. వారు క్రీస్తును అంగీకరించేటట్లు మనం వారికోసం సందర్భానుసారంగా సువార్తను చెప్పాలి. సువార్త మన జీవన శైలిలో భాగమవ్వాలి.

### వ్యక్తిగత సువార్త సేవ ఎలా చేయాలి?

స్టియర్ అనే భక్తుడు వ్యక్తిగత సువార్త ఎలా చేయాలో కొన్ని సూచనలిచ్చాడు.

### ప్రార్థించాలి

ధైర్యం కొరకు, జ్ఞానం కొరకు మనం ప్రార్థించాలి. పౌలు కూడా తన కొరకు ప్రార్థించమని కోరాడు (ఎఫెసీ 6:19-20).

### మాట్లాడాలి

ప్రార్థించిన తర్వాత సాధారణ సంభాషణ ప్రారంభించాలి. వ్యక్తుల పట్ల ప్రేమ ఉంటే భారం, గౌరవం మనలో సహజంగా ఉంటాయి. వ్యక్తుల పట్ల దేవుని ప్రేమ లేకుండా సువార్త చెప్పడం అసాధ్యం. ప్రతి మానవ సమస్యలకు మూలకారణం పాపం అని తెలుస్తుంది. మనిషి సమస్య మరియు మనిషికున్న పాప క్షమాపణ ఆవశ్యకత గూర్చి చెప్పాలి. డి.యల్. మూడీ భక్తుడు ప్రతిరోజూ ఒకరికి సువార్త చెప్పేవాడు.

### సువార్తను వివరించాలి

గాస్పల్ అనే మాటకు "శుభవార్త" అని అర్థం. శుభవార్త ఏంటంటే దేవుడు మనలను తనతో స్నేహం చేయడానికి సృజించెను. అయితే పాపం దేవునికి మానవునికి ఉన్న సంబంధం తెంచివేసింది. ఈ సంబంధం క్రీస్తుప్రభువును విశ్వసించడం ద్వారా మాత్రమే పునరుద్ధరించబడుతుంది. ఎందుకంటే యేసుప్రభువు మన పాపముల కొరకు, మన స్థానంలో మరణించారు. మన విమోచన క్రయధనంగా ఆయనే ప్రాణమిచ్చారు. ఆయన మరణించి తిరిగి లేచుట ద్వారా ఆయన దేవుని కుమారునిగా, మెస్సీయగా విమోచకునిగా నిరూపించబడ్డాడు. నిత్యజీవితం/ రక్షణ, మన మంచి క్రియలను బట్టి కాదు గానీ క్రీస్తుప్రభువును విశ్వసించుట (ఎఫెసీ 2:10) ద్వారానే మనకు దొరుకుతుంది. ఇలాంటి పదాలను మనం ఉపయోగించకపోయినా పర్వాలేదు గానీ వారికి అర్థమయ్యేరీతిలో చెప్పాలి.

ఈ రోజుల్లో ప్రసంగీకులకు కొదువ లేదేమో గానీ దేవుని వాక్యం నిజముగా అనుసరించి చెప్పేవారే కొదువ. అలాంటివారు కొన్ని మాటలు చెప్పినా ఎంతో శక్తివంతంగా విద్యార్థులను, మనతోటి వారిని ప్రభావితం చేస్తాయి.

## వ్యక్తిగత సువార్త సేవను మన జీవనశైలిగా మార్చుకోవడం ఎలా?

### మాదిరి కలిగి జీవించాలి

నేను నా ఇష్టమొచ్చినట్లు జీవిస్తాను, మాట్లాడతాను సువార్త కూడా చెబుతాను అంటే ఎవ్వరూ అంగీకరించరు, వినరు. తోటివారికి నీ జీవనశైలి భిన్నంగా ఉండాలి, వారిని ప్రభావితం చేసేదిగా ఉండాలి. అప్పుడే నీ మాటకు విలువ ఉంటుంది.

### తృష్ణ కలిగి ఉండాలి

చిన్నపాటి ఊరు లాగా ఉన్న అతి భారీ నౌకలో ఇంధనముండే గది చాలా చిన్నదే, కానీ నౌకను నడిపించేది అదే. దేవునికోసం ఏదైనా చేయాలన్న విశ్వాసి తపన అలాంటిదే. వ్యక్తిగత సువార్త ప్రకటించే విషయంలో అలాంటి తపన ప్రతి విశ్వాసికి ఉండాలి.

### ప్రతి అవకాశాన్ని, సందర్భాన్ని వినియోగించుకోవాలి

నాకు గనుక ఇన్ని అవకాశాలుంటేనా, దుమ్ము రేపి ఉండేవాణ్ణి అనుకోవడం సులభం. చేతికొచ్చిన అవకాశాలన్నీ వృథా చేసుకోవడం ఇంకా సులభం. దేవుడిచ్చిన ప్రతి చిన్న అవకాశాన్ని కూడా ప్రజలకు క్రీస్తు సువార్తను చాటే మహావకాశంగా భావించి, దాన్ని సమర్థవంతంగా వాడి అటు దేవునితో, ఇటు ప్రజలతో కూడా శభాష్ అనిపించుకోవడం మాత్రం చాలా కష్టం. అందుకే జీవితంలో వెనక్కి తిరిగి చూసుకొంటే మనం నడిచొచ్చిన దారి నిండా విలువ తెలియక మనం వృథా చేసుకొన్న అవకాశాలు, వనరులే పడి ఉండడం గమనిస్తాము.

### కరపత్రాలు దగ్గర ఉంచుకోవాలి

సాధారణంగా కొన్ని కరపత్రికలు మన జేబులోనో, బ్యాగ్‌లోనో అందుబాటులో ఉంచుకోవాలి. ఎప్పుడు అవకాశం దొరికినా అది కిరాణాషాపుకు వెళ్ళినప్పుడు కావచ్చు, ఆటోలో ప్రయాణిస్తున్నప్పుడు కావచ్చు, ఎయిర్‌పోర్ట్‌లో ఉన్నప్పుడు కావచ్చు. ఎప్పుడు అవకాశం చిక్కినా "వ్యక్తిగత సువార్తకు" సిద్ధంగా ఉండాలి. మన ప్రయాణాల్లో, ఆయా సందర్భాల్లో ఎదురైన విద్యార్థులకు మనం సువార్త చెప్పవచ్చు, ఇంకా అవగాహన కొరకు కరపత్రిక చదవమని సలహా ఇవ్వవచ్చు.

### గురి కలిగి ఉండాలి

ఇప్పుడు మనకున్న గ్రాడ్యుయేట్స్‌లో కొద్దిమంది వ్యక్తిగత సువార్త ద్వారానే ప్రభువులోనికి వచ్చారు. ప్రతి విద్యార్థి, గ్రాడ్యుయేట్, స్టాఫ్ సంవత్సరానికి ఐదుగురి కోసం గురిపెట్టి ప్రార్థించి, వ్యక్తిగత సువార్త సేవ చేస్తే మంచి ఫలితం ఉంటుంది. దేవుని ప్రేమ, భారం లేకపోతే నెహెమ్యా వలె సేవ చేయలేము, రక్షించలేము, నిర్మించలేము. విశ్వసించిన ప్రతి వ్యక్తి రక్షింపబడును (1 యోహాను 5:13).



### నిజమైన మార్పుకోసం ప్రయాసపడాలి

మనం సువార్త చెప్పిన తర్వాత ఆ స్నేహితుడు ప్రభువుని రక్షకునిగా అంగీకరించడానికి సిద్ధమేనా కాదా అని తెలుసుకోవచ్చు. సిద్ధం కాకపోతే ఎందుకో తెలుసుకోవచ్చు. సిద్ధమైతే ఒప్పుకోలు ప్రార్థన చేయించవచ్చు. అయితే ఏదో ప్రార్థన పలికినంత మాత్రాన రక్షణ రాదని చెప్పాలి. దేవునిని హృదయ పూర్వకంగా నమ్మితే రక్షణ వస్తుందని చెప్పాలి. నిజమైన పశ్చాత్తాపం, విశ్వాసం ద్వారా రక్షణ పొందగలము. పాపం నుండి విముఖుడవై, విరిగి నలిగిన హృదయంతో పశ్చాత్తాపంతో యేసు ప్రభు ప్రేమ గలిగిన చేతుల్లోనికి వెళ్ళడమే నిజమైన “మార్పు”. అలాంటి మార్పు లేకుండా దేవుని రాజ్యంలో ప్రవేశించలేమని చెబుతూ దానికోసం ప్రయాసపడాలి.

రక్షింపబడిన వ్యక్తిని ఆత్మీయ అభివృద్ధిలోనికి నడిపించాలి. స్థానిక సంఘానికి నడిపించాలి. వారు దేవునిలో ఎదుగునట్లు మనం ప్రయాసపడదాం. నిజంగా నెహెమ్యా వలె నడుం బిగిస్తే మన విద్యార్థులు చీకటి నిండిన లోకంలో వెలుగును ప్రసరించి నాయకులవుతారు.

## తీసుకోవాల్సిన జాగ్రత్తలు

### అసందర్భంగా చెప్పకూడదు

ఈ రోజుల్లో వ్యక్తిగత సువార్త చేయాలంటే జ్ఞానం, తెలివి, సమయస్ఫూర్తి అవసరం. వ్యతిరేకులు ప్రతి చిన్న దాన్ని కూడా భూతద్దంలో చూపిస్తూ గందరగోళాన్ని సృష్టిస్తున్నారు. గనుక మనం జాగ్రత్తగా ఉండాలి. కొంతమంది ఎలా అయినా సువార్త చెప్పాలని సమయం, సందర్భం లేకుండా చెప్పి చిక్కుల్లో పడతారు. దేవుని వాక్యంలో స్పష్టంగా ‘అజ్ఞానులవలె కాక, జ్ఞానులవలె నడుచుకొనునట్లు జాగ్రత్తగా చూచుకొనుడి’ (ఎఫెసీ 5:16) అని రాయబడింది.

సమయమందును అసమయమందును ప్రయాస పడుదము (2 తిమోతి 4:2). అనగా అనుకూల సమయంలోను, ప్రతికూల పరిస్థితులలోను ప్రయాసపడాలి అని అర్థం. అసందర్భంగా సువార్త చెప్పమని కాదు.

### ఎన్నడూ వాదించకూడదు

వారు సువార్త వినిన తర్వాత కొంతమంది వారికున్న ప్రశ్నలు, అపార్థాల మూలంగా వాదనలోనికి దిగితే ప్రేమతో సమాధానం చెప్పాలి. తీవ్ర వాగ్వివాదాలకు తావివ్వకూడదు. నామాటే గెలవాలనే దృక్పథం వీడాలి. ప్రేమతో సత్యం చెప్పి మౌనంగా ఉండాలి.

### ఎప్పుడూ విమర్శించకూడదు

బహిరంగంగా కొంతమంది రాజకీయ నాయకులను, పార్టీలను, ప్రధానమంత్రులను, ముఖ్యమంత్రులను ఏదో ఒక సందర్భంలో విమర్శిస్తారు. మనం ఏదో ఒక పార్టీకి చెందిన వారంగా కాక దేవునికి చెందిన వారంగా మాత్రమే వ్యవహరించాలి. బహిరంగంగా ఎవ్వరినీ కించపరచకూడదు, విమర్శించకూడదు.

### వివేచన కలిగివుండాలి

కొంతమంది అతితెలివితో మీ గూర్చి, మీ పరిచర్య, అనవసర విషయాలు గూర్చి ఆరా తీస్తారు. అలాంటి వారికి మీ వ్యక్తిగత వివరాలు ఇవ్వనవసరం లేదు. మీరు అన్వేషిస్తే సత్యాన్ని తెలుసు కుంటారని, మనస్సు ఉంటే దేవుడు నన్ను పంపినట్లు మరొకరిని పంపుతాడని చెప్పాలి. బలవంత పెట్టేవారిని, ప్రమాదకారులుగా ఉన్న వారిని తెలివిగా తప్పించాలి. యథార్థంగా ఉండే వారికి మాత్రమే ఫోన్ నంబర్స్ ఇవ్వాలి. అందరికీ ఇవ్వకూడదు. యేసయ్యవలె ప్రేమగలిగి సత్యం చెప్పాలి.

విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని తరచూ వారిని కలుస్తూ, వారి కొరకు ప్రార్థించి దేవుని వాక్యాన్ని పంచుకొని వారి సమస్యలకు క్రీస్తుప్రభువు ఎలా పరిష్కారమో విశదీకరించాలి. వారి ప్రశ్నలకు ఆలోచించి సమాధానం ఇవ్వాలి. తెలియకపోతే తెలుసుకొని తిరిగి ఆ వ్యక్తికి వివరించాలి

– దాసరి రాజేష్, స్టేట్ సెక్రటరీ,
తెలంగాణా రాష్ట్రం, హైదరాబాద్

# సువార్తకు శత్రువులు




సువార్త దేవుని గూర్చినది. అది శుభవార్త. సువార్తలో దేవుని శక్తి ఉన్నది. సువార్తలో దేవుని నీతి ఉన్నది అని దేవుని వాక్యం చెబుతుంది. అది వ్యక్తుల జీవితాలను మారుస్తుంది. అది వ్యక్తుల ను నీతిమంతులుగా చేస్తుంది. సువార్త సందేశంలో యేసుక్రీస్తు జీవితం, మరణం, పునరుత్థానం మరియు ఆయన వాగ్దానాలు ఉన్నాయి. పౌలుగారు సువార్త ప్రకటించకపోతే నాకు శ్రమ అని సెలవిచ్చారు. నిజమే, సువార్త ప్రకటించకపోతే మనకు శ్రమ. మార్పు చెందనివారు, మన పొరుగువారుగా, సహోద్యోగులుగా, అధికారులుగా ఉంటే మనకు శ్రమ. సువార్త ప్రకటించే వారి యొక్క పాదములు సుందరములు అని వాక్యం సెలవిస్తుంది.

సువార్త వ్యక్తులను, వ్యవస్థలను, దేశాలను మారుస్తుంది. సమాజంలో ఉన్న వివక్ష, అణచివేత, అవినీతి, అన్యాయం, అక్రమాలను రూపు మాపుతుంది. మెరుగైన సమాజం - వార్తలు, విశ్లేషణలు, చర్చల ద్వారా సాధ్యం కాదు. అది మార్పు చెందిన వ్యక్తుల ద్వారానే జరుగుతుంది. సువార్తకు ఆటంకాలు మెండు. సువార్త సమానత్వాన్ని తీసుకొస్తుంది. అది కొందరికి ఇష్టముండదు.

### సువార్తకు శత్రువులు

సువార్తకు శత్రువులు బాహ్యంగా, అంతరంగంగా ఉంటారు.

### బాహ్య శత్రువులు

**1. ఈ యుగసంబంధమైన దేవత (సాతాను)**

దేవుని స్వరూపియైయున్న క్రీస్తు మహిమను కనుపరచు సువార్త ప్రకాశము వారికి ప్రకాశించ కుండు నిమిత్తము ఈయుగ సంబంధమైన దేవత అవిశ్వాసులైన వారి యొక్క మనోనేత్రములకు గ్రుడ్డితనము కలుగజేసెను (2 కొరింథీ 4:4). మనసు మూయబడినపుడు సత్యాన్ని గ్రహించలేరు. నమ్మిన సాంప్రదాయాలకు, ఆచారాలకు, కల్పనాకథలకు కట్టుబడిపోయి సత్యాన్ని స్వీకరించక తిరస్కరిస్తారు. సువార్త గ్రహించేటట్లు యేసు శిష్యుల మనసులు తెరిచాడని లూకా 24:45లో రాయబడి ఉంది. ఆయన వారు లేఖనములు గ్రహించునట్లుగా వారి మనస్సులను తెరిచాడు.

**2. వితర్కములు, దేవుని గూర్చిన జ్ఞానమును అడ్డగించే ఆటంకాలు ( 2 కొరింథీ 10:5)**

మన దేశంలో ఉండే తత్వాన్ని ఛేధించడం చాలా కష్టమని పండితులు అంటారు. కారణం మన దేశంలో ఉండే ప్రధాన మతం అది అన్ని మతాలలోని మంచి విషయాలను సంగ్రహించి దాని మతతత్వంలో కలిపేసుకుంది. దానిని సింక్రిటిజమ్ అంటారు. నిజ దేవుని జ్ఞానాన్ని అడ్డగించే ప్రతీ ఆలోచన చెరపట్టి క్రీస్తుకు లోబరుస్తామని పౌలు చెపుతున్నాడు.

**3. అధికారం**

అధికారం ఎప్పుడూ సువార్తకు శత్రువుగా ఉంటుంది. సువార్త నీతి న్యాయాలను, సమానత్వాన్ని బోధిస్తుంది. మానవులందరూ దేవుని స్వరూపంలో చేయబడ్డారు. దాసులని, స్వతంత్రులని, యూదులని, గ్రీసు దేశస్థులని బేధము లేదు. స్త్రీ, పురుషుడని

> సువార్త వ్యక్తులను, వ్యవస్థలను, దేశాలను మారుస్తుంది. సమాజంలో ఉన్న వివక్ష, అణచివేత, అవినీతి, అన్యాయం, అక్రమాలను రూపుమాపుతుంది. మెరుగైన – సమాజం వార్తలు, విశ్లేషణలు, చర్చల ద్వారా సాధ్యం కాదు. అది మార్పు చెందిన వ్యక్తుల ద్వారానే జరుగుతుంది.

బేధము లేదు, అందరూ క్రీస్తులో సమానులని దేవుని వాక్యం సెలవిస్తుంది. సువార్త వివక్షను, అణచివేతను రూపుమాపుతుంది. అందువల్ల కులాల వారిగా విభజించి పాలించే వ్యవస్థలకు అది గొడ్డలిపెట్టు. సువార్త విగ్రహారాధనకు ముప్పు. ఎఫెసీ పట్టణంలో సువార్తకు వ్యతిరేకంగా వ్యాపారస్తులు, ప్రజలు కేకలు వేయడం మనం గమనిస్తాం. అపోస్తలుల కార్యాలలో ఉన్న మతాధికారులు యేసు నామం గూర్చి ప్రకటించకూడదని ఖండితంగా ఆజ్ఞాపించడం మనకు తెలుసు.

### 4. పోస్ట్‌మోడర్నిజమ్

ఆధునికోత్తరవాదం గొప్పగా రాయబడిన విషయాలను, సర్వసత్యాలను తిరస్కరిస్తుంది. రాయబడిన లేఖనాలు కేవలం మానవులను నియంత్రించడానికే అని భావిస్తుంది. సత్యం సాపేక్షమని నమ్ముతుంది. మానవులందరికీ వర్తించే సర్వసత్యాలు లేవు, సత్యం ప్రతీ సమాజానికీ, వ్యక్తులకు వేరు వేరుగా ఉంటుందని చెబుతుంది. పశ్చాత్తాపం కోసం పిలుపు, యేసుక్రీస్తు మరణ పునరుత్థానాలు తిరస్కరించి వాటిని కాలం చెల్లిన భావాలుగా పరిగణిస్తుంది.

### 5. శ్రమ, హింస

శ్రమలు, హింసలు సువార్త ప్రకటించే వారి నైతిక స్థైర్యాన్ని దెబ్బతీస్తాయి. విశ్వాసులలో భయాందోళనలు కలిగిస్తాయి. అంకితభావం గల సువార్తికుల ప్రయత్నాలను అడ్డుకొంటాయి. సువార్త ప్రయత్నాలను పరిమితం చేస్తాయి.

## అంతరంగ శత్రువులు

### 1. అబద్ధ బోధకులు

క్రైస్తవ మూలసత్యాలను నమ్మని అబద్ధ బోధకులు సువార్తకు శత్రువులు. కొంతమంది పునరుత్థానం లేదని చెప్పేవారు, కొంతమంది యేసు నరావతారాన్ని నమ్మని వారు. కొంతమంది రెండవ రాకడను నమ్మని వారు బైబిల్లో కనిపిస్తారు. ఈ మూడు మూల సిద్ధాంతాలు లేకపోతే సువార్తే లేదు. ప్రస్తుతం త్రిత్వాన్ని నమ్మని వారు, యేసుక్రీస్తు కేవలం మానవుడు మాత్రమే అని నమ్మే వారిని క్రైస్తవ ప్రపంచంలో మనం గమనిస్తూ ఉన్నాం. సువార్తకు కొంత కలిపి లేక సువార్తలో నుండి కొంత తీసివేసి ప్రకటించినా అది అబద్ధ బోధే అవుతుంది.

### 2. సువార్త ప్రతిఫలించని క్రైస్తవులు

సువార్త సత్యాలను ప్రతిఫలించని క్రైస్తవ్యం ఇతరులను క్రీస్తు వైపు ఆకర్షించదు. మనం సువార్త సత్యాలకు అనుగుణంగా నడుచుకొనకపోతే సువార్త విశ్వసనీయత కోల్పోతుంది. అపోస్తలుడైన పేతురే అస్పృశ్యత పాటించినప్పుడు పౌలు గారు ఆయనను గద్దించారు (గలతీ 2:12–14). పేతురు సువార్త సత్యమును అనుసరించి క్రమంగా నడుచుకోనప్పుడు పౌలు పేతురును గద్దించాడు. మనం సాంఘిక దురాచారాలకు, అవినీతికి, అక్రమానికి, అన్యాయానికి వ్యతిరేకంగా నడుచుకొనకపోతే అది సువార్త ప్రతిఫలించని క్రైస్తవ్యం.

### 3. భిన్న బోధ

గలతీయులు భిన్న బోధకు ఆకర్షితులై దానివైపు తిరిగి పోయినట్లు మనం చూస్తాం. పౌల (గలతీ 1:6) దానిని ఖండించాడు. నేటి దినాల్లో ప్రాస్పరిటీ గాస్పల్ (1 తిమోతి 1:3) మన టి.వి. ఛానల్స్‌లో చూస్తున్నాము. అన్ని విషయాల్లో మనం అభివృద్ధి చెందాలి అని ఒకే ఒక వచనం తీసుకొని, ఆత్మీయ, మానసిక, వ్యక్తిత్వ అభివృద్ధి గూర్చి మాటలాడకుండా ఆర్థిక అభివృద్ధి కోసమే చెప్పే సువార్త ప్రాముఖ్యతను సంతరించుకొంది. యేసుక్రీస్తు మానవ సమస్యలకు పరిష్కారమే, అది అవాస్తవం కాదు కాని అన్నిటికంటే ప్రాథమిక సమస్య పాపం, దాని పరిష్కారం, రక్షణ సువార్త ప్రకటన ప్రాధాన్యత తగ్గిపోవడం.

### 4. దర్శనం, భారంలేని క్రైస్తవ్యం

నశించేపోయే వ్యక్తుల రక్షణ పట్ల దర్శనం, భారం లేని క్రైస్తవ్యం సువార్తకు, దాని ప్రకటనకు శత్రువు. నేటి సంఘాలు సువార్త ప్రకటనకు, మిషనరీ పరిచర్యకు ప్రాముఖ్యత ఇయ్యకుండా కట్టడాలు, విశిష్టమైన ప్రాంగణాలు, ఆలయాలు నిర్మించడానికి


తమ ధనాన్ని వెచ్చిస్తున్నాయి. సువార్త ప్రకటనకు మిషనరీ పరిచర్యకు ధనాన్ని వెచ్చించే సంఘాలు చాలా తక్కువ.

**5. నామకార్థ, వేషధారణ క్రైస్తవ్యం**

భక్తి, లోకపు విలువలు కలిగిన క్రైస్తవ్యం నేటి దినాన్న మనం చూస్తున్నాం. నిజానికి భక్తి నుండి పరిచర్య ఉద్భవించాలి. మొదటి శతాబ్దపు క్రైస్తవుల ఆరాధనలో నుంచి సాక్ష్యం పుట్టుకొచ్చింది. దాని నుంచి పరిచర్య ప్రవహించింది. నేటి భక్తి క్రైస్తవుల కుటుంబాలకే పరిమితమైన భక్తి. వెళ్ళు లేక వెళ్ళేవారిని పంపించు అనే మిషనరీ స్లోగన్‌లో వారు పాలుపంపులు పొందరు. లోకపు విలువలైన స్వార్థం, ధనాపేక్ష, వస్తువాదం, వినిమయవాదం నేటి క్రైస్తవతరం లక్షణాలు.

**శత్రువులను అధిగమించడం ఎలా?**

1. **ప్రార్థనా శక్తి:** అపోస్తలులు సువార్త ప్రకటించడానికి ధైర్యం కోసం ప్రార్థన చేశారు (అ.కా. 4:30). వారు ప్రార్థించినప్పుడు భూమి కంపించింది. వారు ధైర్యముతో సువార్తను ప్రకటించారు.
2. **దేవునితో సాన్నిహిత్యం:** అపోస్తలుల కార్యాలలో పేతురు, యోహానుల ధైర్యము చూచినప్పుడు, వారు యేసుతో కూడా ఉండినవారు అని గుర్తెరిగారు. దేవునితో సాన్నిహిత్యం మనలను ధైర్యవంతులుగా, వివేకవంతులుగా చేస్తుంది.
3. **పరిశుద్ధాత్మ నడిపింపు:** ఆసియాలో సువార్త చెప్పకూడదని పరిశుద్ధాత్మ వారిని ఆటంకపరచాడు అని పౌలు అపోస్తలుల కార్యములలో రాశారు (అ.కా. 16:6). మనం పరిశుద్ధాత్మ చేత నడిపించబడినప్పుడు పరిచర్య ఫలభరితంగా ఉంటుంది. ప్రతి ఆటంకాన్ని అధిగమిస్తాం.
4. **లోతైన వాక్య ధ్యానం:** లోతైన వాక్యధ్యానం మనం కలిగి ఉన్నప్పుడు అబద్ధ బోధలను సులువుగా గుర్తించవచ్చు. వాటిని ఎదిరించవచ్చు. మన పరిచర్యలో తర్ఫీదు శిబిరాలను, అధ్యయన కేంద్రాలు, వీటిని కొనసాగించి ప్రోత్సహించాలి. నేటి ఇఐయఫ్‌లలో వాక్య అధ్యయనానికి బదులు (స్టడీ) సందేశాలు (మేసేజ్‌లు) ఇవ్వడం శోచనీయం.
5. **శిక్షణ:** ఈ లోకంలో తత్వాలను (ఫిలాసఫీలను) అర్థం చేసుకోవడానికి సువార్తను ఈ తరం వారికి తగినట్లుగా లాజికల్‌గా ప్రకటించడానికి శిక్షణ అవసరం.
6. **పట్టుదలతో కూడిన సామూహిక ప్రార్థనలు:** మనం నెమ్మదిగా, సుఖంగా జీవించడానికి ప్రజలందరి కోసం, అధికారుల కోసం ప్రార్థన చేయమని వాక్యం సెలవిస్తుంది. సంఘం అత్యాసక్తితో ప్రార్థన చేసినప్పుడు పేతురు చెరసాల నుండి విడిపించబడ్డాడు. కాబట్టి ప్రార్థన సువార్తకునిని బంధకాల నుండి విడిపిస్తుంది. సువార్త ప్రకటనకు తావిస్తుంది.
7. **వివేకం:** సువార్త ప్రకటించేటప్పుడు ఇతర దేవుళ్ళను దూషించడం, విమర్శించడం, మన దేవునితో పోల్చడం తగదు. ఇతరుల మనోభావములను దెబ్బతీసి మనం వారిని దేవుని కోసం గెలుచుకోలేము (అ.కా. 19:37). మన దేవునివైపు ఆకర్షించలేము. మనం ప్రేమతో సత్యం చెప్పాలని బైబిల్ మనకు బోధిస్తుంది. మన సత్ప్రవర్తన, సహాయ సహకారాలు, భిన్నమైన జీవితశైలి వ్యక్తిగతంగా ఇతరులకు సువార్త ప్రకటించడానికి సోపానాలుగా ఉంటాయి.



**ముగింపు**

సువార్త వ్యక్తులను, వ్యవస్థలను, వ్యవహారాలను మార్చుతుంది. అది లోకానికి వెలుగు. చీకటిలో మగ్గిపోతున్న వారికి ఆశాకిరణం. సువార్త స్థానంలో భిన్నమైన సువార్త, సువార్త పూర్వ పరిచర్య (ప్రీ ఇవాంజలిజం) ప్రకటించబడుతుంటే అది ఫలితాలను ఇవ్వదు. సువార్తకు మానసిక అంగీకారం మాత్రమే తెలిపి హృదయాలను దేవునికి ఇవ్వని వారు రక్షణ పొందలేరు. సువార్త ప్రకటించు వారి పాదములు సుందరము అని చెప్పబడింది. కాబట్టి సమయమనక, అసమయమనక సువార్త ప్రకటిద్దాం. వ్యక్తులను దేవుని కొరకు సంపాదిద్దాం.

– **జి. జెర్మియా ప్రసాద్,** ఏపి-ఇఐయఫ్ స్టాఫ్, తుని

బైబిల్ స్టడీ

# సమరయ స్త్రీ

## సువార్తీకురాలిగా మారింది

**యోహాను 4:1-42**

సమాజంలో వివక్షతకు గురై పాపములో జీవిస్తూ నిజ దేవుని ఎరుగక అసత్యంలో బతుకుతూ మనశ్శాంతి లేకుండా చీకటిలో జీవిస్తున్న ఒక స్త్రీని యేసుక్రీస్తు ప్రభువు వ్యక్తిగతంగా దర్శించి (వ్యక్తిగత సౌవార్తీకరణ చేసి) ఆమె స్థితిని తెలియజేసి ఆమెకు సత్యాన్ని బోధించి రక్షణలోకి నడిపించి అనేకులను క్రీస్తు వద్దకు నడిపించే సాధనంగా ఎలా మారిందో తెలిపే నిజ సంఘటనను ఈ వాక్య భాగంలో మనం చూస్తాం.

**పరిచయ ప్రశ్న:** మీకు తెలియని వ్యక్తులను పరిచయం చేసుకోవడానికి ఎలాంటి ప్రయత్నాలు చేస్తారు?


1. ఈ వాక్య భాగంలో యేసుక్రీస్తు ఎక్కడి నుండి ఎక్కడికి వెళ్ళాలనుకున్నాడు? ఆయన ఎంచుకున్న మార్గాన్ని మ్యాప్‌లో గుర్తించండి?
2. యూదులు సమరయులతో సహవాసం/ సాంగత్యము చేయకపోవడానికి గల కారణాలు ఏంటి? (1 రాజులు 16, 2 రాజులు17, లూకా 9:51-55, ఎజ్రా 4:1-3)
3. యేసుక్రీస్తు తనను తాను సమరయ స్త్రీకి తెలియపరచుకోవడంలో ఎలాంటి సంభాషణను కొనసాగించాడు?
4. సమరయ స్త్రీ ఎలాంటి జీవితాన్ని జీవించి ఉండవచ్చో వివరించండి?
5. జీవజలం అంటే ఏంటి? నీటికి జీవజలానికి మధ్య ఉన్న వ్యత్యాసాలు ఏంటి?
6. ప్రస్తుతం వ్యక్తులు వారి దాహాన్ని (ఆత్మ తృప్తి, అంతరంగిక సమాధానం, సంతోషం) తీర్చుకోవడం కోసం ఎంచుకొంటున్న మార్గాలు ఏవి? వాటి వల్ల వారు ఎదుర్కొంటున్న పరిణామాలు ఏంటి?



7. దేవుని( ఆరాధన) గురించి సమరయ స్త్రీ కలిగి ఉన్న అభిప్రాయం ఏంటి? దానిని యేసుక్రీస్తు ఎలా సరి చేశారు? వ 20-26
8. యేసును మెస్సీయగా తెలుసుకున్న తర్వాత సమరయ స్త్రీ ఎక్కడికి వెళ్ళింది? ఏం చేసింది? దాని ఫలితాలు ఏంటి? వ 28-30, వ 39-42
9. సమరయ స్త్రీని రక్షించడంలో క్రీస్తు ఎలాంటి పరిస్థితులను అధిగమించాడు? దానిని బట్టి ఆయన వ్యక్తిత్వాన్ని ఏమని అర్థం చేసుకోవచ్చు?
10. సువార్తను ప్రకటించడానికి నీకు ఎదురయ్యే ఆటంకాలు ఏంటి? వాటిని అధిగమించడానికి ఎలాంటి ప్రయత్నాలు చేస్తావు?

- **భారతి,** స్టాఫ్, అనంతపూర్

**గమనిక:** ఈ సంచిక నుంచి ప్రతి నెల ఒక బైబిల్ స్టడీని ప్రచురిస్తాము. గనుక ప్రతిఒక్కరు వ్యక్తిగతంగా ఈ బైబిల్‌స్టడీస్ చేయాలని, ఆత్మీయ ఆశీర్వాదాలు పొందుకోవాలని ఆశిస్తున్నాము. **- మీ ఎడిటోరియల్ బోర్డ్**



# థియాలజీలోని విభాగాలు

“క్రైస్తవులు సరైన బైబిల్ ప్రాపంచిక దృష్టి కోణాన్ని నిర్మించడానికి బైబిల్ అంతటికి సంబంధించిన వేదాంత శాస్త్రం (థియాలజీ) వారికి అవసరం” అని అంటాడు ప్రముఖ థియాలాజియన్, అపోలోజిస్ట్ యల్‌టి జయచంద్రన్. థియాలజీ అనేది కేవలం ప్రొఫెసర్స్, పాస్టర్స్, కొంతమందికి మాత్రమే పరిమితమైన అధ్యయనం లేదా వారికే అవసరం, మిగిలిన వారికి అది అవసరం లేదు అని చాలా మంది అభిప్రాయం. ఇది ఎంత మాత్రమూ సత్యము కాదు. ఎవరైతే దేవుని గురించి, ఆయనతో ముడిపడిన విషయాల గురించి ఆలోచిస్తూ, ప్రశ్నిస్తూ, నమ్ముతున్న వాటి గురించి ఒక నిర్ధారణకు వస్తారో వాళ్ళంతా థియాలాజియన్‌లే. ఎందుకంటే మనం ప్రతిరోజూ థియాలజీలో నిమగ్నమై ఉంటాం.

యేసు క్రీస్తు ఇచ్చిన గ్రేట్ కమీషన్‌లోని “సర్వలోకానికి వెళ్ళి సర్వ సృష్టికి సువార్త ప్రకటించి, నమ్మిన వారిని శిష్యులుగా చేయమని” చెప్పడంతో పాటు “ఆజ్ఞాపించినవన్నీ బోధించాలి” (మత్త. 28:20) అనే విషయాన్ని మనం విస్మరించకూడదు. శిష్యత్వంలో మనకు అందించిన మంచి సిద్ధాంతాలను ఇతరులకు అందించటం యొక్క ప్రాముఖ్యత మనం చూడాలి. మనం వేదాంత శాస్త్రాన్ని సరిగా అర్థం చేసుకొంటేనే ఇతరులకు సరిగా అందివ్వగలం. కాబట్టి ఈ థియాలజీ గురించి మరికొన్ని ప్రాముఖ్యమైన విషయాలను చూద్దాం.

## నిర్వచనం

థియాలజీ అనేది రెండు గ్రీక్ పదాల నుంచి వచ్చింది. “థియోస్” అంటే దేవుడు అని, “లోగోస్” అంటే అధ్యయనం అని అర్థం. థియాలజీ అంటే దేవుని గురించి, ఆయన గుణగణాల గురించి, దేవునితో ముడిపడిన విషయాలను గురించి అధ్యయనం చేయడం. బైబిల్ మొత్తం మీద సమగ్రమైన అవగాహనను ఇచ్చేది థియాలజీ. అనంతుడైన దేవుణ్ణి అర్థం చేసుకొనే మన ప్రయత్నాలు, మన పరిమిత అవగాహన కారణంగా తగ్గిపోయినప్పటికీ, ఆయన ఎవరో అర్థం చేసుకోవడానికి దేవుడు మనకు బైబిల్‌ను ఇచ్చాడు (2 తిమోతి 3:16-17).

“ఫెయిత్ సీకింగ్ అండర్‌స్టాండింగ్” ఇది వేదాంతశాస్త్రం యొక్క శాస్త్రీయ నిర్వచనాల్లో ఒకటి. దీని అర్థం “యేసు క్రీస్తులో వెల్లడైన దేవునిపై విశ్వాసం, లోతైన అవగాహనకు ప్రయత్నించేలా ప్రేరేపిస్తుంది. విశ్వాసానికి-హేతువుకు సంబంధం ఉంది. మనం గుడ్డి నమ్మకంతో దేవుని దగ్గరకు వెళ్ళం. కానీ హేతువును వాడుకొని విశ్వాసాన్ని అభ్యాసం చేస్తాం.

## ప్రాముఖ్యత

వేదాంత శాస్త్రం ప్రాముఖ్యమైనది ఎందుకంటే కేవలం దేవుని గూర్చిన జ్ఞానం సంపాదించుకోవడంతో సరిపెట్టుకోకుండా, ఎల్లప్పుడూ దేవుణ్ణి ప్రేమించి, ఆరాధించేలా చేస్తుంది. ఇది మన జీవితాలపై సంపూర్ణ ప్రభావాన్ని చూపుతుంది. దేవుని గురించి మంచి అవగాహనను పెంపొందించుకోవడం వల్ల మనం భిన్నంగా ఆలోచిస్తాం, విభిన్నంగా జీవిస్తాం.

“థియాలజీ ఒక మ్యాప్‌లాంటిది” అని అంటాడు క్రైస్తవ మేధావి సి.యస్.లూయిస్. అది మన మనసుల్ని దేవుని గూర్చి ఒక హేతుబద్ధమైన, ఆచరణాత్మకమైన అవగాహనకు నడిపిస్తుంది. వేదాంత శాస్త్రం యొక్క లక్ష్యం దేవునిని బాగా తెలుసుకొని, ప్రేమించడమే. ఇది జీవితకాల ప్రయత్నం, ఎప్పటికీ అంతం లేని

అన్వేషణ. జ్ఞానం కోసం కాదు, దేవునితో నిరంతరం లోతైన సంబంధం కోసం ఇది తప్పక అవసరం.

## ఎందుకు స్టడీ చేయాలి?

యుఇయస్ఐకి చాలా పటిష్టమైన సిద్ధాంత పరమైన పునాది ఉంది. మన క్యాంప్స్ (ఇసి,డిటి, యల్టి, సియంటిసి) లో సిద్ధాంతాలను బోధిస్తాం. విన్న వాటితోనే మనం సరిపెట్టుకొంటాం. కానీ ప్రతి సిద్ధాంతంపైన మనకి పూర్తి అవగాహన క్రమమైన అధ్యయనం ద్వారానే వస్తుంది. ఇంకా మారిపోతున్న విద్యార్థుల అవసరాలను, పోకడలను, సమస్యలను గూర్చి మాట్లాడాలన్నా, కలవరపెడుతున్న రకరకాల తప్పుడు బోధలను వాక్యానుసారంగా ఎదుర్కోవాలన్నా, క్రీస్తనే పునాది పైన మన విశ్వాస జీవితాన్ని కట్టుకోవాలన్నా, దేవుని గూర్చి, ఆయనతో మన సంబంధం గూర్చి, మన జీవిత పరమార్థం గూర్చి తెలుసుకొని ఆధ్యాత్మికంగా ఎదగాలన్నా, మన పరిచర్య ఫలవంతంగా కొనసాగాలన్నా, మనం వేదాంతశాస్త్రాన్ని అధ్యయనం చేయాల్సిందే.

## విభాగాలు

వేదాంతశాస్త్రం యొక్క విశిష్టత, విస్తృతి మానవ శాస్త్రాలలో అసమానమైనది. వేదాంతశాస్త్రాన్ని నాలుగు విభాగాలుగా విభజించడం జరిగింది. అవి బైబిల్ వేదాంతశాస్త్రం, చారిత్రక వేదాంతశాస్త్రం, క్రమబద్ధమైన వేదాంతశాస్త్రం మరియు ఆచరణాత్మక వేదాంతశాస్త్రం. ఈ ఏర్పాటు 19, 20వ శతాబ్దాలలో స్థిరపడింది. ఇంకా చాలా చూస్తాం అయితే వేదాంతశాస్త్రం యొక్క చరిత్రలో ఎక్కువ భాగం ఈ నాలిగింటి మధ్య అనుకూలంగా ఆమోదించడమైనది.

### బైబిల్ వేదాంతశాస్త్రం (బిబ్లికల్ థియాలజీ)

బిబ్లికల్ థియాలజీ/స్క్రిప్చరల్ థియాలజీ కేవలం లేఖనాలపై ఆధారపడి ఉంటుంది. బైబిల్ వేదాంతశాస్త్రం, వాళ్ళ చారిత్రక, కాలక్రమ నేపథ్యాల ప్రకారం సిద్ధాంతాలను అధ్యయనం చేస్తుంది. ఇందులో ఒక అంశం గురించి ఒక్కొక్క రచయిత ఏమి బోధించారో, అది ఆయా సమయాల్లో, చరిత్రలో ఎలా అభివృద్ధి చెందుతూ వచ్చిందో దానిపై ప్రత్యేక శ్రద్ధ పెడుతుంది. ఉదా: త్రిత్వము/విమోచన గురించి పాతనిబంధన, నూతన నిబంధనలో, మోషే రాసిన పంచ కాండాల్లో ఎలా ఉంది? పౌలు, యోహాను, లూకా, పేతురు వాళ్ళ రచనల్లో ఎలాంటి అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు? ఏ విషయంలోనైనా విభేదించారా? ఎందుకు? వారి మూల పాఠకులు వాటిని ఎలా అర్థం చేసుకొన్నారు? అనే విషయాలన్నీ పరిశీలించడానికి సహాయపడుతుంది. దేవుడు చరిత్రలో తనను తాను క్రీస్తు ద్వారా ఎలా ప్రత్యక్ష పరచుకొంటూ వచ్చారో, ఆయన రక్షణ ప్రణాళిక ఎలా నెరవేర్చుకొంటూ వచ్చారో తెలుసుకోవడానికి తప్పకుండా మనం ఒక్కొక్క అంశాన్ని కూలంకుషంగా అధ్యయనం చెయ్యాలి.

### చారిత్రక వేదాంత శాస్త్రం (హిస్టారికల్ థియాలజీ)

క్రైస్తవ సిద్ధాంతం చరిత్రలో ఎలా అభివృద్ధి చెందిందో చారిత్రక వేదాంత శాస్త్రం తెలుపుతుంది. సంఘ చరిత్రలో ప్రాముఖ్యమైన క్రైస్తవ సిద్ధాంతాలు ఎలా రూపొందించారో అవి ఎలా అభివృద్ధి చెందాయో వివరిస్తుంది. ఉదా. దేవుడు, యేసుక్రీస్తు, పరిశుద్ధాత్ముడు, రక్షణ, సంఘము, అంత్యకాల సంగతులు మొదలైనవి. క్రైస్తవ సంఘ చరిత్రలో వివిధ సమయాల్లో కొందరు వేదాంతవేత్తలు, సంఘ పితరులు ప్రాముఖ్యమైన పాత్రను పోషించారు. రకరకాల క్రీడ్స్ (అపొస్తలుల విశ్వాసం, నికేయ విశ్వాస ప్రమాణం, అతనేషియన్ విశ్వాస ప్రమాణం, వెస్ట్‌మినిస్టర్ కన్ఫెషన్ మొ॥), రకరకాల కౌన్సిల్స్‌చే రూపొందించబడ్డాయి. విభిన్న మత విశ్వాసాలు, కల్ట్స్ ఈ కాలంలోనే అభివృద్ధి చెందాయి. ఈ చారిత్రక వేదాంత శాస్త్రం సంఘ చరిత్రలో జరిగిన అన్ని పరిణామాలను పరిశీలించి పరిగణలోనికి తీసుకొంటుంది. మొదటి శతాబ్దంలోని వాళ్ళు త్రిత్వము/క్రిస్టాలజీ సిద్ధాంతాల్ని ఎలా అర్థం చేసుకొన్నారు? ఆ సిద్ధాంతాలు ఎలా వ్యాప్తి చెందాయి? కొన్ని సార్లు క్రీడ్స్, కన్ఫెషన్స్ ద్వారా, చర్చి కౌన్సిల్స్, ఇతర మీటింగ్స్ ద్వారా, వక్రబోధల ద్వారా, అవి ఎలా ఏర్పాటయ్యాయి? వీటన్నిటి ద్వారా ఎలా వ్యాప్తి చెందాయి? అని కూడా ఇది అధ్యయనం చేస్తుంది (అపొ.కా. 1:1). బైబిల్ సత్యాల నుండి ఎలా తొలగిపోయారు? ఎవరు, ఎప్పుడు వాటిని సరిచేశారు? ఇవన్నీ మనం తెలుసుకోవడం ద్వారా మనం జాగ్రత్తగా స్టడీ చేస్తాం. అందుకే ప్రతి సిద్ధాంతాన్ని వాక్యపు వెలుగులో పరిశీలించి, పరీక్షించడంతో పాటు వివరించాలి (2 తిమోతి 3:16-17). సంఘ చరిత్ర అంతటిలో దేవుడు ఎలా పనిచేశాడన్నది, సత్యం కోసం, సరైన సిద్ధాంతాలను సంఘానికి అందించడానికి వారు

పడిన ప్రయాస ఎంత గొప్పదన్నది అర్థం అవుతుంది. ఇప్పుడు కూడా ఇంకా దేవుడు పనిచేస్తున్నాడని మనం స్టడీ చేస్తున్నప్పుడు మనకు అర్థం అవుతుంది.

### క్రమబద్ధమైన వేదాంతశాస్త్రం (సిస్టమాటిక్ థియాలజీ)

క్రమబద్ధమైన వేదాంతశాస్త్రం అనేది క్రైస్తవ సిద్ధాంతాన్ని తార్కికంగా ఒక క్రమంలో ఉంచే ప్రయత్నం చేస్తుంది. ఇది తరచుగా ఒక ప్రాథమిక సూత్రం నుంచి ప్రారంభమవుతుంది. వీటిని క్రైస్తవ సంఘం ప్రారంభదశ నుంచి అభ్యాసం చేస్తుంది. మనం ఇప్పుడు చూస్తున్న సిద్ధాంతాలు అప్పటినుండి అభివృద్ధి చెందుతూ వచ్చినవే. బైబిల్లో ఉండే వివిధ అంశాలకు సంబంధించిన వాక్యభాగాలను సేకరించి అర్థం చేసుకొన్న తర్వాత ఒక్కొక్క అంశాన్ని గూర్చి మనం ఏమి నమ్మాలో సమగ్రంగా వివరించి చెప్తుంది. ఉదా: త్రిత్వము/విమోచన/క్రిష్టాలజీ. ఒక సిద్ధాంతం గూర్చి బైబిల్ అంతా ఏం చెప్తుంది? సంఘ చరిత్రలో ఈ సిద్ధాంతాలను ఎలా భోదించారు? వాళ్ళు ఎలా అర్థం చేసుకొన్నారు? ఒక సిద్ధాంతాన్ని గూర్చిన సమాచారాన్ని బైబిల్ నుంచి ఇతర మూలాల నుంచి సేకరించడం, శాస్త్రీయంగా ఏర్పాటు చేసుకోవడం, సరిచూసుకోవడం, బయట నుంచి ఎదురయ్యే ప్రశ్నలను ఎలా లాజికల్‌గా ఎదుర్కోవాలో ఆలోచించడం, అన్నీ క్రోడీకరించి ఒక క్రమమైన పద్ధతిలో కూర్చుకొని వాటిని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తాం.

దేవుడు లేదా పరిశుద్ధ లేఖనాల సిద్ధాంతాలతో ఈ సిస్టమాటిక్ థియాలజీ మొదలవుతుంది. వీటి తరువాత సృష్టిలో మరియు ప్రొవిడెన్స్‌లో దేవుని పని, మానవుని పతనం మరియు పాపం యొక్క స్వభావం, విమోచనలో దేవుని పని, సంఘ స్వభావం మరియు చివరి దినాలు అనే విభాగాలుగా ఉన్నాయి.

### ఆచరణాత్మక వేదాంతశాస్త్రం (ప్రాక్టికల్ థియాలజీ)

ఆచరణాత్మక వేదాంతశాస్త్రం అనేది మిగిలిన వేదాంత విభాగాలైన బిబ్లికల్, హిస్టారికల్, సిస్టమాటిక్ థియాలజీల నుంచి మనం నేర్చుకున్న విషయాలను ఎలా మన జీవితానికి అన్వయించుకోవాలన్న విషయాల్లో సహాయపడుతుంది. మనము నమ్మే విశ్వాస సత్యాలను అర్థం చేసుకుంటూనే ఉద్దేశపూర్వకంగా "నాకెలా ఈ అంశం వర్తిస్తుంది"? నా జీవితానికి ఈ అంశానికీ ఉన్న సంబంధం ఏంటి"? అని ప్రశ్నించుకొంటూ, అవసరమైన విషయాలను సరిదిద్దుకొంటూ, మంచి విలువలతో జీవించాలని కోరుకోవడమే ప్రాక్టికల్ థియాలజీ ఉద్దేశం. ఇది అధ్యయనం చేసిన ప్రతి సిద్ధాంతంలో కూడా వ్యక్తిగత జీవితానికి, పరిచర్యకు ఉన్న సంబంధాన్ని వివరిస్తుంది. అంతే కాకుండా సేవా నాయకులగా ఉంటున్న విశ్వాసులను ప్రభావవంతమైన వాక్య బోధకులుగా తయారు చేయడమే దీని ఉద్దేశం. ఇది వాక్య సత్యాల్ని మనకు, మన పనికి, కుటుంబానికి, సహవాసానికి, సంఘానికి, ప్రపంచానికి, అన్నింటికీ అన్వయిస్తుంది.

"దేవుని గురించి అనేక విషయాల్లో జ్ఞానం సంపాదించుకోవడంతో సరిపెట్టుకోకుండా వాటిని తమ జీవితాల్లో అన్ని కోణాలకు అన్వయించుకోవడమే థియోలజీ" అని అంటారు జాక్ ఫ్రేమ్.

మన కాలంలో ఉన్న సమస్యలను తీసుకొని బైబిల్ పరంగా దాన్ని ఆలోచించి, ఇతర మూలాల నుండి కూడా సమాచారం సమగ్రంగా సేకరించి స్టడీ చేయాలి. వేదాంత విశ్లేషణ చేసేటప్పుడు బైబిల్ ప్రధానంగా మన మనసులో ఉంటుంది. దానితో పాటు సందర్భం, తత్వశాస్త్రం, సంస్కృతి, హేతువు వీటన్నింటినీ పరిగణలోనికి తీసుకొంటాం.

### ముగింపు

మన అధ్యయనం, అభ్యాసం, దేవుణ్ణి సమగ్రంగా అర్థం చేసుకొని, ఆయనను ఆనందంగా, అర్థవంతంగా ఆరాధించడానికి నడిపించకపోతే మనం విఫలమయినట్లే.

మనం అధ్యయనం చేసిన లేఖన సత్యాలన్నీ మన జీవన విధానాన్ని ప్రభావితం చేయాలి. అర్థం చేసుకోవడమే కాదుగాని దానిని అనుదిన విశ్వాస జీవితంలో అన్వయించుకోవడం ద్వారా మనం దేవుడు ఆశించిన జీవితాలు జీవిస్తూ సంఘాన్ని, సమాజాన్ని, ప్రపంచాన్ని ప్రభావితం చేసే వ్యక్తులుగా మారగలం.

వేదశాస్త్రంలోని సిద్ధాంతాలు ఎంతో ప్రాముఖ్యమైనవి. వీటిని ఇంకా లోతుగా అధ్యయనం చేస్తూ, క్రమమైన విధానంలో నేర్చుకొని, మన జీవితాల్లో వాటిని అన్వయించుకుంటూ, మన విద్యార్థులకు, గ్రాడ్యుయేట్స్‌కి సరైన సిద్ధాంతాలు బోధిద్దాం. దేవుని గురించి ఇంకా లోతుగా తెలుసుకొని ఆయనను ప్రేమిద్దాం, ఆరాధిద్దాం, ఆయన ఆశించిన జీవితాలు జీవిద్దాం.

– **ఆర్. సుమ శ్రీనివాస్,** స్టాఫ్, గుంటూరు


# ఆదాము

## మొదటి మానవుడు

దేవుని కుమారుడైన ఆదాము మరణించాడు. బైబిల్లో రికార్డు చేసిన మొట్టమొదటి సహజ మరణమది. ఆ వార్త దావానలంలా వ్యాపించింది. చాలామంది వచ్చి చూసి పోతున్నారు. తమ పితరుడు, తామంతా ఎవరి నుంచైతే వచ్చారో ఆయన చనిపోయాడు. ఆదాము యొక్క మనుమ సంతానమంతా చేరారు. ఆదాము కుమారుడైన షేతు నుండి నోవహు తండ్రి లెమెకు వరకు ఎనిమిది తరాలకు చెందిన వారు ఆయన పార్థీవ దేహం వద్దకు వచ్చారు.

ఆదాము 930 సం॥లు ఈ భూమిపై బ్రతికాడు. హనోకును చూశాడు, హనోకు మెతూషెలను కనిన తరువాత దేవునితో నడవడం చూశాడు. బైబిల్ ప్రకారం ఈ భూమ్మీద అత్యధిక సం॥లు బ్రతికిన వారిలో ఆదాము 4వ వాడు. మెతూషెల, యెరెదు, నోవహు తర్వాత ఆదాము అత్యధిక సం॥లు బతికినవాడు. ఆదాము చనిపోయేనాటికి నోవహు తండ్రి లెమెకుకు 56 సంవత్సరాలు. కాబట్టి ఆదాము తన వారసులను దాదాపు లెమెకు వరకు చూశాడు. అప్పటికి హనోకును దేవుడింకా తనతో తీసుకెళ్ళలేదు.

ఆదాము దేవుని హస్తాలతో తయారై దేవుని ఊపిరితో బతికి ఈ లోకంలో జీవించిన మొదటి మానవుడు. అతని గురించి ఆదికాండం 1-5 అధ్యాయాలలో చూస్తాం. అతడు దేవుని స్వరూపంలో సృజించబడినవాడు. దేవుని స్నేహితుడు. ఆదాము ఈ భూమికి మొట్టమొదటి గృహనిర్వాహకుడు. మానవజాతి అంతటికి తండ్రి. ఆదాము మొట్టమొదటి జంతు శాస్త్రవేత్త. దేవుడు సృజించిన ప్రాణుల న్నిటికీ పేర్లు పెట్టిందాయనే. ఆదాము గొప్ప హార్టీకల్చరిస్ట్. తోటపని, నీటి పారుదల, మొక్కల సంరక్షణ మొదలైన వాటన్నిటినీ చాలా శ్రద్ధగా చేశాడు. ఒక మంచి ఫ్రెండ్. అన్ని జంతువులతో, పక్షులతో, దేవునితో కూడా మంచి స్నేహాన్ని చేశాడు. ఆదాము మంచి కవితాత్మక హృదయం గలవాడు.



దేవుడు స్త్రీని నిర్మించి ఆమెను ఆదాము దగ్గరకు తీసుకొచ్చినప్పుడు ఆమెకు హవ్వ అని పేరు పెట్టడమే కాదు. అప్పటికప్పుడు ఒక మినీ కవితను ఆమెను చూసి చెప్పేశాడు. ఆదాము గురించి బైబిల్లో దాదాపు 27 సార్లు ఉదహరించారు. నూతన నిబంధనలో 8 సార్లు ఆదాము ప్రస్తావన కనిపిస్తుంది. ఆదాము, హవ్వల గురించి కొన్ని 'సూడోగ్రాఫికల్' రచనలు కూడా ఉన్నాయి. బైబిల్ పండితులు ఆదాము హవ్వలు నివసించిన ఏదేను తోట ఇప్పుడు పర్షియన్ గల్ఫ్‌లోని 'అనతోలియా' అనే ప్రాంతంలో ఉండేదని చెబుతున్నారు.

ఆదామును ఇస్లాంలో మొదటి మానవుడిగా పరిగణిస్తున్నారు. అయితే ఆదామును ప్రవక్తగా నమ్ముతున్నారు. అల్లా ఆదామును బురద మట్టితో చేశాడని, తర్వాత అతనిలోకి దేవుడు తన ఆత్మను ఊదాడని ముస్లింలు నమ్ముతారు.

బైబిల్లో ఆదాము పాత్ర చాలా పెద్దది. "ఆదామును అర్థం చేసుకోవడం అంటే దేవుని గురించి, మానవ స్వభావం గురించి, పాపం యొక్క తీక్షణత గురించి, దేవుడు మానవాళిని, ఈ భూమిని రక్షించే ప్రణాళికను అర్థం చేసుకోవడం".

కొన్ని హీబ్రూ (యూదుల) సంప్రదాయాల ప్రకారం ఆదామును దేవుడు 3760 బిసిలో సూర్యాస్తమయానికి కొన్ని గంటల ముందు సృజించాడని నమ్ముతారు. అది వారికి హీబ్రూ పౌర

సంవత్సరంగా పరిగణిస్తూ బూరల పండుగను (ఫీస్ట్ ఆఫ్ ట్రంపెట్స్) ప్రతి సం॥ము జరుపుకొంటారు.


హీబ్రూలో ఆదాము అంటే 'ఎరుపు' లేదా 'ఎరుపు భూమి' (మట్టి) అని అర్థమిస్తుంది. యూదా చరిత్రకారుడు 'జోసెఫస్' తన 'యాంటిక్విటీస్'లో ఆదాము ఎర్రటి భూమి నుంచి ఏర్పడ్డాడు. కాబట్టి అతనిని ఆదాము అని పిలిచారని రాశాడు.

ఆదాము గురించి మనందరికీ సుపరిచితమే. ఆదాము తన జీవితములో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నాడు. తను, తన భార్య చూపిన అవిధేయత అనగా సాతాను చేతిలో మోసపోయి చేసిన పాపం ఫలితంగా ఈ భూమి ఎంతగా భ్రష్టుపట్టి పోయిందో తన కళ్ళారా చూశాడు, చెవులారా విన్నాడు, మనసారా గ్రహించాడు. తన దీర్ఘకాల జీవిత ప్రయాణంలో ఇవన్నీ చూశాడు. దాదాపు హనోకు కాలం నాటికే భక్తిహీనత అతి భయంకరంగా ప్రబలిందని, దేవుని తీర్పు రాబోతుందని హనోకు ప్రవచించాడని ప్రభువు సహోదరుడైన యూదా తన పత్రికలో రాశాడు (యూదా 14). తన కుమారుల దగ్గర నుంచి ఆదాము పాపం యొక్క ప్రతిఫలాన్ని అనుభవించాడు. అలాగే తన జీవితంలో దేవుని నుంచి మొట్టమొదటి వాగ్దానాన్ని పొందాడు. జోసెఫస్ తన పుస్తకంలో ఆదాము హవ్వలు 33 మంది కుమారులను, 23 మంది కుమార్తెలను కలిగి ఉన్నారని రాశాడు.

ఆదాము ఎదుర్కొన్న వాటన్నింటిలో అత్యంత భయానకమైనది ఏదేను తోట నుంచి తోలివేయబడడం. దేవునిచేత నేరుగా శపించబడడం, తన కళ్ళముందే కుమారులు నాశనమవ్వడం. చాలాకాలం వాళ్ళిద్దరు (ఆదాము, హవ్వ) ఒంటరిగా దేవుని సాన్నిధ్యం లేకుండా గడపడం అనేది పాపం ఎంత భయంకరమైన ఫలితాన్ని ఇస్తుందో మనకు కళ్ళకు కట్టినట్లు కనిపిస్తుంది.

ఆదాము తన వారసుల్లో హనోకు దేవునితో నడవడం చూశాడు. దేవుని మాటలను అతడు పలకడం చూశాడు. దేవుడెంత కోపాన్ని ప్రదర్శిస్తాడో, ఎంత కరుణామయుడో కూడా ఆదాముకు తెలుసు. తను పాపంలో పడకమునుపు ఎంత ఆనందాన్ని అనుభవించాడో తన జీవిత కాలమంతా గుర్తుచేసుకొనే ఉంటాడు.

కానీ దేవుని కృప మనమీద ఎంత అపరిమితమో



| మొదటి ఆదాము | కడపటి ఆదాము (క్రీస్తు) |
|---|---|
| అవిధేయత | విధేయత |
| శోధించబడ్డాడు | శోధించబడినా పాపం చేయలేదు |
| మరణము | జీవము – పునరుత్థానము |
| పాపము | నీతి |
| శిక్ష | నీతిమంతులుగా తీర్చబడడం |
| పాపానికి మొదలు | పాపానికి అంతము |
| జీవించు ప్రాణి | జీవింపచేయు ఆత్మ |

కొరింథీ సంఘానికి పౌలు రాసిన మాటలను బట్టి మనం అర్థం చేసుకోవచ్చు. "ఆదాము జీవించు ప్రాణి, కడపటి ఆదామైన క్రీస్తు జీవింపజేయు ఆత్మ" (1 కొరింథీ 15:45).

దేవునితో ఆదాము (మానవాళి) కోల్పోయిన సంబంధాన్ని, దేవుడే పూనుకొని క్రీస్తులో ఆ సంబంధాన్ని పునరుద్ధరించి మనలను రక్షించి తన కుమారులుగా కుమార్తెలుగా చేసుకొన్నాడు. ఆయన నిరంతరం స్తోత్రార్హుడు. ఆమెన్.

## నేర్చుకోవాల్సిన విషయాలు

1. దేవుడిచ్చిన స్వేచ్ఛను దేవుని వెదకడానికే ఉపయోగించాలి.
2. సాతాను అబద్ధికుడు, మోసం చేసేవాడు. వాడి తంత్రాలలో పడకుండా మెళకువగా ఉండాలి.
3. దేవునికి అవిధేయత, పాపం మన జీవితాల్లో అనేక చెడుఫలితాల్ని తీసుకు వస్తుంది. ఆదాము చేసిన పాపం వల్ల సమస్త మానవాళి ఎలా బాధపడుతుందో, మనం దేవునికి చూపించే అవిధేయత వల్ల, చేసే పాపం వల్ల మన కుటుంబం, తోటివారు నష్టానికి, కష్టానికి లోనవుతారు.
4. దేవుని నుంచి దాక్కోలేము.
5. దేవునితో స్నేహం ఆనందమయ జీవితాన్నిస్తుంది.

– జేసన్ బత్తుల, చీరాల

# కుటుంబంగా కలిసి సేవచేద్దాం

కొరింథీ చర్చ్‌లో అకుల, ప్రిస్కిల్ల అనే ఆదర్శ దంపతులున్నారు. అప్పటి రోమా చక్రవర్తి యూదులను బహిష్కరిస్తే, వాళ్ళు ఇటలీ నుండి కొరింథీ పట్టణానికి పొట్ట చేతపట్టుకొని వచ్చిన శరణార్థులు. వృత్తిరీత్యా డేరాలు కుట్టుకొనే వారు, రెక్కాడితే కానీ డొక్కాడని కష్టజీవులు, నిరుపేదలు. వారి వనరులు, స్థితిగతులు పరిమితం కానీ వారిద్దరి గుండెల్లో దేవుని కోసం ప్రజ్వలిస్తున్న తపన, దర్శనం, ప్రేమ మాత్రం అనంతం. అందుకే పౌలు, అపోల్లో వంటి మహా గొప్ప ఆదిమ అపొస్తలుల పరిచర్యకు వారు అండగా నిలిచారు. క్రైస్తవ్యానికి, చర్చ్‌ల స్థాపనకు వ్యతిరేకత ఉన్న కొరింథీ, ఎఫెసీ ప్రాంతాల్లో పౌలు తమ ఇంటిలోనే చర్చ్‌ని స్థాపించేందుకు ఆ జంట ధైర్యంగా ముందుకు వచ్చారు(అపో.కా.18). వారు కలిసి ప్రయాణించారు, కలిసి పని చేశారు.

మన యుఇయస్ఐ పరిచర్యలో కుటుంబంగా కట్టబడడం, కుటుంబంగా సేవచేయడం అనేది ఎంతో సమర్పణ, త్యాగం, సవాళ్ళతో కూడుకొన్న విషయం. దేవుని చిత్తానుసారంగా కట్టబడిన కుటుంబాలు ప్రభువు కొరకు ప్రయాసపడడం ఎంతో ప్రాముఖ్యమైనది.

### 1. క్రైస్తవ గృహము (ఆది 2:18-24; ఎఫెసీ 5:31; 1 పేతురు 3:7)

దేవుడు ఆదామును చేసి, స్త్రీని ఆదాము నుంచి నిర్మించాడు. భార్యకు శిరస్సు పురుషుడు, ప్రతి పురుషునికి శిరస్సు క్రీస్తు. పురుషుడు - తండ్రిని తల్లిని విడిచి భార్యను హత్తుకొనును, వారు ఏకశరీరమై ఉందురు. ఈ కాన్సెప్ట్‌ను సరిగా అర్థం చేసికోవాలి. కుటుంబంగా ఏర్పడడంలో ఆత్మీయ, మానసిక, శారీరక, సామాజిక సిద్ధపాటు ఇద్దరికి అవసరం. కుటుంబంగా ఏర్పడిన తర్వాత చిత్తశుద్ధి అవసరం. కుటుంబంలో అనేక రకాలైన చింతలు, ఒత్తిడులు, బాధ్యతలు ఉంటాయి. దేవత్వములోని



ఐక్యత, ప్రేమ కుటుంబంలో మనం కలిగియుండాలి. భర్త పోషించేవాడుగా, భార్య జ్ఞానవంతురాలుగా కుటుంబాన్ని కట్టుకొన్నప్పుడు బిడ్డలు ఒలీవ మొక్కల వలె ఉంటారు. భార్యాభర్తలు సమాన హక్కులు గల వారై విధేయత, నమ్మకము, యధార్థత, సహకారం కలిగియుండాలి.

### 2. క్రైస్తవ కుటుంబ సిద్ధపాటు

భార్యాభర్తలిద్దరూ మారుమనస్సు అనుభవంతో తృప్తిచెందక, దేవునిని కుటుంబంగా ఆరాధిస్తూ, ప్రేమిస్తూ, సేవించే వారిగా ఉండాలి. ఇరువురు అనుదిన ప్రార్థన, వాక్యధ్యానం కలిగి దేవునిలో ఎదిగే వారిగా ఉండాలి. దేవుని పరిచర్య పట్ల శ్రద్ధ కలిగి ఉండాలి. విద్యార్థుల పరిచర్య పట్ల దర్శనం, భారం కలిగి ఉంటే పని చేయడానికి సిద్ధపడతాము, కుటుంబంగా స్థానికంగా జరిగే ఇయు, ఇజియఫ్ పరిచర్యలో స్వచ్ఛందంగా పాల్గొంటాము. విద్యార్థుల పరిచర్య పట్ల శ్రద్ధ, ఆశ, తపన, భారం ఏర్పడతాయి. పరిచర్యలో పాల్గొనలేకుండా ఉండలేము. అప్పుడు మన కుటుంబాలు దేవునిని, మనుష్యులను సంతోషపెట్టేవిగా ఉంటాయి. మన కుటుంబాల ద్వారా దేవునిని ఘనపరచడానికి సిద్ధపడదాం.

### 3. క్రైస్తవ కుటుంబ సమర్పణ (రోమా16:3,4)

భార్యాభర్తలిద్దరూ ఒకరిపట్ల ఒకరు సమర్పణ కలిగి, కుటుంబంగా దేవుని సేవ కొరకు సమర్పించుకోవాలి. రెగ్యులర్‌గా జరిగే మీటింగ్స్‌తో సరిపుచ్చు

కోకూడదు. ఇది కేవలం మన కుటుంబానికి క్షేమం కలిగిస్తుంది. ఆ గీత దాటి ముందుకు వచ్చి స్టూడెంట్స్ కొరకు బిబియస్‌లు, ఇబియస్‌లు తీసుకొంటూ, ప్రార్థిస్తూ, సలహాలు ఇస్తూ, సహాయ సహకారాలు అందించే ఓపెన్ హోమ్‌గా ఉంచుకోడానికి సమర్పణ కలిగియుండాలి. అందుకోసం మన సమయం, తలాంతులు, ధనం, కన్నీరు, సమర్పిం చాల్సి ఉంటుంది. కొన్ని సందర్భాలలో నిందలు, అవమానం, విమర్శలు, హేళనలు భరించాలి. దేవుని పనిలో ఖర్చుయిపోవడానికి ఇష్టపడుదాం.


## 4. క్రైస్తవ కుటుంబ ప్రాధాన్యతలు

1. **దేవుడు:** భార్యాభర్తలిరువురు మొదటిగా దేవుని ప్రేమిస్తూ (మౌనధ్యానం, ప్రార్థన) ఆయనతో సన్నిహిత సంబంధం కలిగియుండాలి. దేవునికి లోబడి ఆయనకు విధేయులుగా ఉండాలి.
2. **కుటుంబము:** భార్యాభర్తలిరువురు కుటుంబాన్ని కట్టుకోడానికి కొంత సమయం కలసి సంభాషించుకోవాలి. బిడ్డలను పెంచడం, పోషించడం పట్ల శ్రద్ధ కలిగియుండాలి. కుటుంబ బాధ్యతలు ఇరువురు కలసి నిర్వహించుకోవాలి.
3. **ఉద్యోగము:** మనలను దేవుడు ఏ ఉద్యోగములో ఉంచినా అది దేవుడు అనుగ్రహించినదే. కాబట్టి మనము దేవునికి జవాబుదారీగా ఉండాలి. కష్టపడి, సామర్థ్యంతో, నమ్మకంగా పనిచేయాలి.
4. **పరిచర్య:** ప్రాధాన్యతలలో చివరిది పరిచర్య. అయితే పై మూడు బాధ్యతలు నిర్వహిస్తూ, పరిచర్య కొరకు మనము సిద్ధపడుతూ సమయాన్ని కేటాయించుకోవాల్సి వస్తుంది.

పైన చెప్పిన విధంగా ప్రాధాన్యతలు పాటించినప్పుడు కుటుంబము ఎంతో ఆశీర్వాదకరంగా ఉంటుంది. ఈ ప్రాధాన్యతలను తప్పి మనం వ్యవహరిస్తే అనేక ఇబ్బందులను కొని తెచ్చుకుంటాము.

## 5. క్రైస్తవ కుటుంబంలోని సంబంధాలు (అ.కా. 18:1-4)

* భార్యాభర్తలిరువురు వారి ఆలోచనలను, అభిప్రాయాలను వ్యక్తపరచుకోవాలి.
* వారిరువురు తమ బలాలను, బలహీనతలను తెలిసికోవాలి.



* కుటుంబ బాధ్యతలు, పరిచర్య బాధ్యతలు కలసి మాట్లాడుకోవాలి.
* కుటుంబములోని పిల్లలు, రక్తసంబంధులు, అత్తమామల విషయాలలో బాధ్యతలు నిర్వహించడంలో సయోధ్య అవసరం.
* కుటుంబంగా బాధ్యతలు షేర్ చేసికొంటూ, కమ్యూనికేషన్ స్పష్టముగా ఉన్నప్పుడు సమస్యలను అధిగమించగలం.
* కుటుంబంలో ఓర్పు, సహనంతో తీర్మానాలు చేసుకోవడం మంచిది.
* భార్యాభర్తలిరువురు క్షమించుకోవడం, ఘనపరచుకోవడం, ప్రేమ కలిగి, నమ్మకత్వం కలిగియుండుట, లోబడుట, విధేయత కలిగి ఉండడం, ఆదరించుకోవడం ద్వారా పరిచర్యలో ఎంతో సజావుగా కొనసాగగలం.

## 6. క్రైస్తవ కుటుంబంగా సేవ చేయడానికి అవకాశాలు (యెహోషువ 24:15, 2 తిమోతి 2:2)

**ఫెలోషిప్:** ఇసి, డిటి, యల్‌టి క్యాంప్స్, కాన్ఫరెన్స్‌లు, ఫెలోషిప్ గ్యాదరింగ్స్‌కు హాజరవ్వడం ద్వారా అనేక విషయాలు నేర్చుకొని ఆత్మీయంగా వర్ధిల్లుతాము. గనుక మనము నేర్చుకొన్నప్పుడు ఇతరులకు ప్రయోజనకరంగా ఉండగలం. సహవాసం మనకు ఎలా సేవ చేయాలో మనకు నేర్పిస్తుంది.

**ఇయు పరిచర్యలో:** ఇబియస్, బిబియస్, యంపిసి, ప్రేయర్ సెల్స్, కౌన్సిలింగ్, ప్రేయర్ సపోర్ట్, స్టూడెంట్ నీడ్స్, ఆర్థిక అవసరాలు మొదలగు విషయాల్లో విద్యార్థులతో కలసి వారి కొరకు పరిచర్య చేయగలం.

**ఇజియఫ్ పరిచర్యలో:** స్థానికంగా జరిగే ఇజియఫ్ గ్యాదరింగ్స్‌లో పాల్గొనడం, బైబిల్ స్టడీ తీసికోవడం,

సీనియర్ అడ్వైజర్‌గా ఉండాల్సి వస్తే బాధ్యతను తీసికోవడం, ఇజియఫ్ కమిటీ, గర్ల్స్ మినిస్ట్రీ, వివిధ కమిటీల బాధ్యతలు నిర్వహించడం ద్వారా సేవ చేయవచ్చు. లోకల్‌గా మన ఇన్‌వాల్వ్‌మెంట్ ముఖ్యం. స్థానికంగా విద్యార్థుల పరిచర్య కొరకు మీ కుటుంబమే ప్రాముఖ్యమైంది. కుటుంబంగా మిమ్మల్ని ఏర్పాటు చేసింది ఆయన కొరకు మాత్రమే.

ఈ విధంగా కుటుంబంగా కలసి ప్రతి అవకాశాన్ని వినియోగించుకొని శ్రద్ధగా, ప్రార్థనాపూర్వకంగా పాల్గొందాం.

### 7. క్రైస్తవ కుటుంబంగా కలసి సేవ చేయడానికి ఏర్పడే అవరోధాలు

- ఒకరిని ఒకరు పరిచర్య కొరకు ప్రోత్సహించుకో లేకపోవడం.
- పరిచర్యను గూర్చి ఇరువురు సంభాషించుకో లేకపోవడం.
- కుటుంబంగా సమయం, ధనం, తలాంతులు, శరీర శ్రమ, త్యాగం చేయడానికి మనస్సు లేకపోవడం.
- ఇన్‌లాస్ విషయంలో, కుటుంబ బాధ్యతల విషయంలో సరైన విధంగా ఒకరికి ఒకరు సహకరించుకోలేకపోవడం.
- నీది, నాది అనే భావన బలంగా ఉండడం, "మనము" అనే బలమైన బంధం లేకపోవడం.
- ఇరువురు వారి సామర్థ్యాలను పక్కనబెట్టి న్యూనతా భావం కలిగియుండుట.
- దేవునిచే కట్టబడిన కుటుంబంలో సాతాను తంత్రాలను గమనించుకోలేకపోవడం.
- ఆరోగ్య, ఆర్థికపరమైన ఇబ్బందులు కూడా మన సేవకు అభ్యంతరకరంగా ఉంటాయి.

### ముగింపు

యుఇయస్ఐ పరిచర్యలో ఆదర్శవంతమైన కుటుంబాల ఆవశ్యకత చాలా ఎక్కువ. మన కుటుంబం పట్ల దేవుని ఉద్దేశం నెరవేర్చబడడానికి తగిన సమర్పణ, యధార్థత, నమ్మకత్వం అవసరం. అవరోధాలను అధిగమించి, నమ్మకంగా ఆయన సేవలో కుటుంబంగా కొనసాగుదాం.

– **లీలారాయ్,** ఒంగోలు

కవిత

## మనోవేదనలో మువ్వన్నెల జెండా

భారతదేశం – నా మాతృభూమి
భారతీయులందరూ – నా సహోదరులు
నేను నా దేశమును – ప్రేమించుచున్నానని
పాఠశాల – ప్రతిజ్ఞ ద్వారా
పసితనము నుండే – నేర్పే
సూక్తి – సన్మార్గమిదే
దేశమంటే – మట్టికాదోయ్
దేశమంటే – మనుషులోయ్
సువిశాల – భారతావనిలో
సురక్షితంగా ఎవరైనా జీవించవచ్చు

అయితే ....
'మణిపూర్' నిండా – మంటలావరించె
'కుకి' గిరిజనులు – కాల్చబడె
క్రైస్తవ మందిరాలు – కూల్చబడె
నిలువనీడలేక – భయముతో
అడవిలోని ఆక్రందనలు – మిన్నంటె
రాక్షసత్వం – కట్టలు తెంచుకొనియె
ప్రాణభయంతో – పరుగులు తీసె జనులు

పై పరిస్థితులను బట్టి – రాజధాని తల్లడిల్లవలె
ప్రధాన పాలకులు – దృష్టిసారించవలె
భారత జనాభాలో – మణిపూర్ ప్రజలు లేరా?
29 రాష్ట్రాలలో – మణిపూర్ ఒకటి కాదా!

మణిపూర్ – 'కుకి' గిరిజనులు
మొదటగా – భారతీయులు
ఎప్పటికినీ – భారతీయులే
క్రైస్తవ మార్గములో – జీవించుట వలన
కన్నెర్రచేసి – పసిబిడ్డలను, స్త్రీలను
చంపడం – ఎంతవరకు న్యాయం?
లౌకిక రాజ్యం – మత స్వేచ్ఛను ఇవ్వలేదా?
రాజ్యాంగం – జీవించే హక్కు కల్పించలేదా?

నాదేశంలో .....
ఇంత – మారణహోమమా?
అమాయక – ప్రజలపై
ముష్కరుల – దాడి జరుగుచుండె
ఈ పరిస్థితులన్నిటిని – గమనించిన
భారత జెండా – పరితపించుచున్నది
స్వేచ్ఛ, సమానత్వం, లౌకిక రాజ్యం
రాజ్యాంగ సూత్రాలను
నాదేశ ప్రజలందరికి – కల్పించండి

– **యస్.సి.హెచ్. ఎలీషా,** నర్సరావుపేట



# గురిలేని జీవితం

ఏడుస్తూ ఉన్న చిన్నపిల్లల్ని అమ్మ ఎత్తుకొని చందమామ వైపు చూపిస్తూ, ఇలా పాట పాడుతుంది. చందమామ రావే, జాబిల్లి రావే, కొండెక్కి రావే, గోగుపూలు తేవే, అన్నీ తెచ్చి మా అమ్మాయి కియ్యవే, అన్నీ తెచ్చి మా అబ్బాయి కియ్యవే అని పాట పాడుతూ ఉంటే ఏడ్చే పిల్లలు అలా చందమామ వైపు చూస్తూ నోరు తెరిచేస్తారు. వెంటనే అమ్మ వారి నోట్లో భోజనం పెడుతుంది. ఇది మనందరికి తెలిసిన విషయమే. అయితే ఒకవేళ మనం 'చందమామ చందమామ నీవెందుకున్నావు?' అంటే 'నేను రాత్రిని ఏలడానికి ఉన్నాను' అనే సమాధానం వస్తుంది. 'సూర్యుడా, సూర్యుడా నీవెందుకు ఉన్నావు అంటే నేను పగటిని ఏలడానికి ఉన్నాను' అని సూర్యుడు చెబుతాడు. 'సముద్రమా సముద్రమా నీవెందుకు ఉన్నావు అంటే 'నాలో జలచరాలు జీవించడానికి, నేను నన్ను సృష్టించిన సృష్టికర్తను నా ఘోష ద్వారా స్తుతించడానికి ఉన్నాను' అని సముద్రం చెపుతుంది. అదే ప్రశ్న మానవుని అడిగితే వెంటనే సమాధానం చెప్పలేని స్థితి.

ఈ రోజుల్లో యవ్వనస్తుల్ని అడిగితే 'నా జీవితం నా ఇష్టం' అంటున్నారు. మరి ఇయు విద్యార్థులుగా మీరేమి చెప్తారు? ప్రసంగి 11:9 ప్రకారం యవ్వనుడా నీ యవ్వనమందు సంతోషించుము, నీ యవ్వనకాల మందు నీ హృదయము సంతుష్టిగా ఉండనిమ్ము, నీ కోరిక చొప్పున నీ దృష్టి యొక్క ఇష్టము చొప్పున ప్రవర్తించుము. అయితే వీటిన్నిటిని బట్టి దేవుడు నిన్ను తీర్పులోనికి తెచ్చునని జ్ఞాపకముంచుకొనుము. మరి దేవుని మాటల ప్రకారం దేవుడు ప్రతి ఒక్కర్ని తీర్పులోనికి తీసుకొని వస్తాడు. కాబట్టి మన ఇష్టానుసారంగా బతకడానికి అవకాశం లేదు. మాటలు రాని చందమామ, సూర్యుడు, సముద్రానికి ఒక ఉద్దేశం, గురి, గమ్యం ఉన్నప్పుడు తన పోలికలో సృజించుకొని, యేసుప్రభువు రక్తంలో కడుగబడి వెల యిచ్చి మనల్ని కొని తన బిడ్డలుగా చేసుకొన్న మన గురి ఏంటి? తెగిన గాలిపటం, గురిలేని జీవితం రెండూ ఒకటే. తెగిన గాలిపటం ఎటు గాలి కొడితే అటువైపు వెళుతుంది. గురిలేని జీవితాలు కూడా అంతే.

### గురి మన జీవితానికి ఎందుకు అవసరం?

నీవు అభివృద్ధికి ఒక గురి పెట్టుకోకపోతే, అభివృద్ధి చెందకుండా వుండడానికి గురి పెట్టుకున్నట్టే అని అంటాడు రాబర్ట్ షుల్లర్. యిర్మీయా 1:4-5 ప్రకారం, 'గర్భంలో నేను నిన్ను రూపింపకమునుపే నిన్నెరిగిరితిని, నీవు గర్భము నుంచి బయట పడకమునుపే నేను నిన్ను ప్రతిష్టించితిని. జనములకు ప్రవక్తగా నేను నిన్ను నియమించితిని' అంటే తల్లి

గర్భములో మనం రూపించబడకమునుపే దేవునికి మన పట్ల ఒక ప్రణాళిక ఉంది. అందుకే దేవుడు యెషయా 55:8లో నా తలంపులు మీ తలంపుల వంటివి కావు. మీ త్రోవలు నా త్రోవల వంటివి కావు అంటున్నాడు. కాబట్టి మన గురికి, జీవితానికి, దేవునికి సంబంధం ఉంది. మన జీవితంలో దేవుడు కేంద్ర బిందువుగా ఉన్నప్పుడు ఆయన తలంపును తెలుసుకోగలుగుతాము. సృష్టికర్తయైన దేవుడు ఈ లోకంలోకి వచ్చినప్పుడు ఒక గమ్యం, గురి కలిగి వచ్చాడు. మార్కు 10:45 ప్రకారం మనుష్య కుమారుడు పరిచారము చేయించుకొనుటకు రాలేదు గాని పరిచారము చేయుటకును మరియు అనేకులకు ప్రతిగా విమోచన క్రయధనముగా తన ప్రాణమునిచ్చుటకు వచ్చెను. పౌలు గారు కూడా నేను గురి యొద్దకే పరిగెడుతున్నాను అన్నాడు. యేసయ్యకి గురి ఉంది, పౌలు గారికి గురి ఉంది. అదే విధంగా ఎంతోమంది భక్తులు గురి కలిగి జీవించి దేవుని నామానికి మహిమ తెచ్చారు. కాబట్టి దేవుని నామానికి మహిమ తీసుకొని రావాలన్నా, మన జీవితాలు అర్థవంతంగా, ఫలభరితంగా ఉండాలన్నా మనకు గురి అవసరం. గురి మన జీవితానికి చుక్కాని వంటిది. మనం ఎటువైపు పయనిస్తున్నామో తెలియజేస్తుంది.

## కెరీర్‌లో గురి కలిగి ఉండటం

కెరీర్ అనే మాటను ఫ్రెంచ్ మూలపదం నుంచి తీసుకొన్నారు. దీని అర్థం మార్గం లేదా బాట. ఇయు విద్యార్థులుగా విశ్వాసాన్ని, కెరీర్‌ని వేరువేరుగా చూడకూడదు. పరిచర్యని, చదువుని రెండింటిని బ్యాలెన్స్ చేసుకొని దేవుని చిత్త ప్రకారం కెరీర్‌లో స్థిరపడాలి. మన కెరీర్ ద్వారా దేవునికి మహిమ తీసుకొని రావాలి. ఇలా ఒక క్రమపద్ధతిలో ముందుకు వెళ్ళాలంటే కెరీర్‌లో గురి అనేది చాలా అవసరం. కాబట్టి మన పెద్దవారు కూడా ఆలోచించి దేవుని నడిపింపు ప్రకారం కెరీర్ గైడెన్స్ డిపార్ట్‌మెంట్‌ని పెట్టారు. ఆత్మీయంగా ఎదగడం, కెరీర్‌లో స్థిరపడడం రెండు ప్రాముఖ్యమైనవే. 1 కొరింథీ 9:26-27 ప్రకారం నేను గురి చూడనివానివలె పరిగెత్తువాడను కాను. గాలిని కొట్టినట్లు నేను పోట్లాడుట లేదు... అని పౌలు గారు అంటున్నాడు. పౌలు గారి గురి అన్యులకు సువార్తను ప్రకటించడం. ఆయనకు ఒక గురి ఉంది కాబట్టి మూడు మిషనరీ ప్రయాణాలు చేసి ఎంతోమందికి సువార్తను ప్రకటించి సంఘాలను స్థాపించాడు. మోషే గురించి ఇలా రాయబడింది. మోషే ఐగుప్తీయుల సకలవిద్యలను అభ్యసించి, మాటలయందును, కార్యములయందును ప్రవీణుడైయుండెను (అ.కా. 7:22). డా. ఎ.పి.జె. అబ్దుల్ కలాం గారి గురువు గారు తన చిన్నప్పుడు ఒక పక్షి గురించి పాఠం చెపుతున్నప్పుడు ఒక నిర్ణయం చేసుకొన్నాడు. నేను ఒక పెద్ద శాస్త్రవేత్తని అవ్వాలని ఒక గురి పెట్టుకొన్నాడు. అలా తన కెరీర్‌లో రాష్ట్రపతి కూడా అయ్యాడు. ఈ ఆర్టికల్ చదువుతున్నప్పుడు దేవుని బిడ్డలుగా ఇయు విద్యార్థులుగా కెరీర్‌లో స్థిరపడడానికి మీ గురి ఏంటి?

## గురిని ఏర్పరచుకోవడంలో, దాన్ని నెరవేర్చడంలో ఎందుకు విఫలం అవుతాం?

గురిని ఏర్పరుచుకొనేటప్పుడు నీ పట్ల ఉన్న దేవుని చిత్తం, మన సామర్థ్యాలు, బలాలు, బలహీనతలు, అవకాశాలు, వీటన్నింటిని దృష్టిలో పెట్టుకొని గురిని లేదా లక్ష్యాన్ని ఏర్పర్చుకోవాలి. ఆవేశంలో నేను ఐఏయస్, ఐపియస్, గ్రూప్ 1 ఆఫీసర్/ బ్యాంక్ మేనేజర్‌ని అవుతానని గురిపెట్టుకోకూడదు. మన గురించి మనకు అవగాహన ఉండాలి. ఇక్కడే మనకు స్వాట్ ఎనాలసిస్ ఉపయోగపడుతుంది. ఒక పేపర్ తీసుకొని దానిని నాలుగు భాగాలు చేసి వాటిలో ఈ క్రింది విధంగా రాసుకోవాలి.




ఇలా మన గురించి బేరీజు వేసుకొని ప్రార్థనా పూర్వకంగా మన గ్రాడ్యుయేట్స్, పేరెంట్స్, టీచర్స్ యొక్క సహాయంతో మన గురిని లేదా లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకోవాలి. దీనిని నెరవేర్చడంలో మనం ఎందుకు విఫలం అవుతామంటే, నేను

చేరుకోలేనేమోననే భయం, ఫెయిల్ అవుతానని, మనల్ని మనం తక్కువగా అంచనా వేసుకోవడం, వాయిదా వేయడం, సోమరితనం, ఆశ లేకపోవడం, దేవుని మీద ఆధారపడకపోవడం, తమను గురించి ఎక్కువగా ఊహించుకోవడం, సరైన అవగాహన లేకపోవడం, చంచల మనస్సు, సమయపాలన, క్రమశిక్షణ లేకపోవడం, కష్టపడకపోవడం, ఫోన్‌కు ఎక్కువ సమయం కేటాయించడం ఇవన్నీ లక్ష్యాన్ని చేరుకోలేకపోవడానికి కారణాలు.

### చదువులో, కెరీర్లో ఎలా గురి కలిగి ఉండాలి?

ఇయు విద్యార్థిగా గురి లేదా లక్ష్యాన్ని పెట్టుకొనేటప్పుడు దీర్ఘకాలిక లక్ష్యాలు, స్వల్పకాలిక లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవాలి. ఉదాహరణకు దీర్ఘకాలిక లక్ష్యంగా ఐఏయస్, ఐపియస్, బ్యాంక్ ఆఫీసర్, టీచర్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఇలా ఏదైనా పెట్టుకొంటే మొదట చదువుల్లో రాణించాలి. అంటే షార్ట్ టర్మ్ లక్ష్యం డిగ్రీ లేదా బి.టెక్‌లో డిస్టింక్షన్ లేదా ఫస్ట్‌క్లాస్‌లో పాస్ అవ్వాలి. ఇటు చదువులో అయినా కెరీర్‌లో అయినా స్మార్ట్ గోల్స్ కలిగి ఉండాలి.

Specific – నిర్దిష్టమైనది

Measurable - కొలవతగినది

Achievable - చేరుకోగలిగినది

Realistic - వాస్తవమైనది

Time-Bound - సమయానికి చేరుకోగలిగినది

మనం పెట్టుకునే గమ్యం, గురి లేక లక్ష్యం చేరుకోగలిగినవి లేదా నెరవేర్చగలిగినవై ఉండాలి. ఈవిధంగా మనం గురి కలిగి వుండాలి.

### లక్ష్యాన్ని ఎలా సాధించాలి?

* ప్రణాళిక వేసుకోవాలి.
* క్రమశిక్షణ కలిగి ఉండాలి.
* వ్యక్తిగతమైన టైంటేబుల్ ఉండాలి.
* కష్టపడాలి. ప్రసంగి 9:10, సామె 6:6.
* నిజాయితీగా, నిబద్ధతతో చదవాలి, పని చేయాలి.
* కొత్త వాటిని నేర్చుకోవడానికి ఇష్టపడాలి.
* పట్టుదల కలిగి ఉండాలి.
* ఎక్కువకాలం గుర్తుంచుకోవడానికి ఎక్కువ సార్లు చదువుతూ, రిమైండ్ చేసుకోవాలి.
* సృజనాత్మకత ఉండాలి.
* ప్రతి పరిస్థితిలో దేవునిపై ఆధారపడాలి.
* పరిశుద్ధత కలిగి ఫలించాలి, ప్రార్థనా జీవితం కలిగి ఉండాలి.
* ప్రతిరోజు, ప్రతివారం, ప్రతినెల మనల్ని మనం ఇవాల్యుయేట్ చేసుకోవాలి.

### బైబిల్లో లక్ష్యాలను సాధించినవారు

యోసేపు కూడా ఫరో తరువాత ఫరో అంతటి వాడిగా ఐగుప్తు దేశంలో నియమించబడ్డాడు (ఆది 41:41). ఒక ఇంజనీర్ వలె ప్రణాళికలు వేసుకొని ఏడు సంవత్సరాల్లో సమృద్ధిగా పండిన పంటను నిల్వచేసి ఆ దేశాన్ని కరువు నుంచి కాపాడటమే కాకుండా చుట్టూ ఉన్న వారికి కూడా ఆహారాన్ని సరఫరా చేశాడు (ఆది 41:47–49). నెహెమ్యా గురి కలిగిన వాడు. పడద్రోయబడిన యెరూషలేము ప్రాకారమును యాభైరెండు రోజుల్లో సమాప్తి చేశాడు. దానియేలు, అతని స్నేహితులు కొత్త ప్రదేశంలో బానిసత్వంలో ఉండి కూడా కల్దీయుల భాషను, విద్యను, తత్వాన్ని అభ్యసించారు. రాజు వీరి గురించి విచారణ చేయగా వీరు మిగిలిన వారికంటే పదింతల శ్రేష్ఠులని తెలిసింది (దానియేలు 1:20). యేసుప్రభువు వారు గురి కలిగి ఈ లోకానికి వచ్చి తన పనిని సంపూర్ణంగా ముగించాడు (యోహాను 19:30).

### ముగింపు

యోసేపు, నెహెమ్యా, దానియేలు మొదలగు వారందరూ ప్రభువు కొరకు నమ్మకంగా, పరిశుద్ధంగా గురి కలిగి జీవించారు. కాబట్టి వారి జీవితాల ద్వారా దేవుడు మహిమపరచబడ్డాడు. వారికి ఎన్ని శ్రమలు, కష్టాలు, ఇబ్బందులు, ఎదురైనా ప్రభువుని ఆనుకొని వాటిని జయించగలిగారు. కాబట్టి మన ఆత్మీయ జీవితానికి, కెరీర్‌కి సంబంధం ఉంది. మాటలు రాని సూర్యుడుకి, చంద్రుడికి, సముద్రానికి ఒక ఉద్దేశం గురి ఉన్నప్పుడు, దేవుని బిడ్డలమైన మన జీవితాలలో గురి కలిగి జీవించవద్దా? మన చదువుల ద్వారా, కెరీర్ ద్వారా, మంచి ఉద్యోగాలలో స్థిరపడి మన జీవితాల ద్వారా ఆయన నామానికి మహిమని తెద్దాం. మీ నిర్ణయం ఏంటి?

– డా. యం. సాల్మన్ రాజు, వైజాగ్

# పండిత రామాబాయి

## స్వదేశీ మిషనరీ

పండిత రమాబాయిగా ప్రసిద్ధి చెందిన ఈ బాలిక దక్షిణ భారత దేశం కర్నాటక రాష్ట్రంలో కనరా అనే ప్రాంతంలో 1958 ఏప్రిల్ 23 న నిష్ఠాగరిష్ఠులైన బ్రాహ్మణ కుటుంబంలో అందరిలో చిన్నదిగా జన్మించింది. ఈమె ఆరు నెలల పసికందుగా ఉన్నప్పుడు తల్లిదండ్రులు బిడ్డ నొక గంపలో పెట్టుకొని పుణ్యక్షేత్రాల్ని దర్శించడం ప్రారంభించారు. పుణ్య తీర్థాల్లో స్నానమాడి, దేవాలయాల్ని దర్శిస్తూ యాత్రికుల కొరకు బహిరంగ స్థలాల్లో సంస్కృత పురాణాలను చదువుతూ ఒక్కొక్క చోట కొన్ని నెలలు ఉండేవారు. దైవభక్తిగల హిందూ యాత్రికులు పురాణాల్ని విన్నాక, తమకు తోచిన సహాయం చేసేవారు. ఆ రీతిగా ఆ కుటుంబం జీవిస్తూ ఉండేది.

### క్షామం

రమాబాయి వారి కుటుంబం నివసిస్తున్న ప్రాంతంలో క్షామం ప్రబలి పోయింది. తండ్రి చిక్కి శల్యమై మరణావస్థలో ఉండగా, అందరూ ఒక దేవాలయంలో చేరారు. కాని, అక్కడున్న పూజారులు వారిని తరిమేశారు. తర్వాత గ్రామం వెలుపల నున్న పాడుబడిన దేవాలయంలో తలదాచుకొని అక్కడే వారి తండ్రి మరణించాడు. ఆకలి బాధతో వరుసగా తల్లి, సోదరి కూడా మరణించారు.

### కలకత్తా

తమ కుటుంబంలో అందరూ మరణించగా అన్న, చెల్లెలు మిగిలారు, పెద్ద దిక్కంటూ లేక, డబ్బు సంపాదించే శక్తి లేక, జీవితాన్ని ఎదుర్కొనవలసిన ఆ బిడ్డలకు జీవితం పోరాటమే! చలి బాధకు తాళలేక నదీ తీరాల్లోని ఇసుకలో పడుకొంటూ, తరచుగా ఉపవాసాలతో పుణ్యక్షేత్రాల్ని దర్శిస్తూ నిరంతరం పయనిస్తూ వీరు కలకత్తా చేరారు. కొన్నాళ్ళకు అక్కడే విద్యావేత్తలైన బ్రాహ్మణులతో పరిచయం ఏర్పడింది. రమాబాయి పురాణాల్లో పాండిత్యాన్ని, వాదనా శక్తిని పెంపొందించుకొంది. ఆమె తెలివి




తేటలను మెచ్చిన పండితులామెకు ‘పండిత’ అనే బిరుదు ప్రధానం చేశారు. ఇక్కడ వారి భుక్తికి లోటు లేకుండా గడిచి పోయేది. స్త్రీల దుస్థితిని పరిశీలించిన పండిత రమాబాయి, స్త్రీల దుస్థితిని పోగొట్టడానికి వారిని విద్యావంతులుగా చేయాలని, స్త్రీ జనోద్ధరణ తన ప్రథమ కర్తవ్యమని ధైర్యంగా బహిరంగ సభల్లో ఉపన్యసించేది. కలకత్తాలోనే ఆమెకు క్రైస్తవులతో పరిచయం ఏర్పడింది. వారి ఆచార వ్యవహారాలు, ప్రవర్తన ఆమెలో ఆసక్తిని కలిగించాయి. సంస్కృతంలో బైబిలు ఆమెకెవరో ఇచ్చారు. అందులోని విషయాలు అర్థం కానందున ఆమె దానిని చదువకుండా దాచి పెట్టుకొంది. హిందూ మత గ్రంథాల్ని, పురాణాల్ని తరచి చదివి స్త్రీలకు ఎలాంటి ఆధ్యాత్మిక విమోచన కనుగొనలేక నిరాశ చెందింది. దేవుని కొరకైన వెదుకులాటలో నిజ దేవుడెవరో తెలిసికోలేక తన పితృ పారంపర్య దేవతారాధనను మానివేసింది. ఇరవై రెండేళ్ళ వయసులో బెంగాలీ శూద్ర యువకుణ్ణి వివాహ మాడింది.

### దైవాన్వేషణ

భర్తతో కలసి అస్సాంలో నివసిస్తున్న సమయంలో ఆమెకు బెంగాలీ భాషలో ముద్రించబడిన లూకా సువార్త లభించింది. దానిని ఎంతో ఆసక్తితో ఆమె చదువుతున్న సమయంలోనే ఒక క్రైస్తవ మిషనరీ ఆమెను క్రమంగా దర్శిస్తూ బైబిల్లోని కథల అంతరార్థాన్ని వివరిస్తుండేది. క్రైస్తవ్యం పట్ల రమాబాయి చూపుతున్న ఆదరణ భర్తకు నచ్చలేదు. పరిస్థితి తీవ్రరూపం దాల్చక ముందే కలరా వ్యాధితో

ఆమె భర్త మరణించాడు. వివాహమైన రెండేళ్ళకే భర్త మరణించడంతో పాతిక సంవత్సరాలు నిండక ముందే రమాబాయికి వైధవ్యం ప్రాప్తించింది.

భర్త మరణానంతరం కుమార్తె మనోరమతో కలిసి ఆమె పూనా వెళ్ళింది. అక్కడున్న క్రైస్తవ మిషనరీ ద్వారా క్రీస్తు ప్రభువును గురించి వింటూ ఉండేది.

భారతదేశపు స్త్రీల అభ్యున్నతి కొరకేదో చేయాలనే పట్టుదలతో పండిత రమాబాయి మొదట తను తగిన విద్యార్హతల్ని సంపాదించుకొని శిక్షణ పొందాలని ఆశించి ఆమె 1883వ సంవత్సరం కుమార్తెతో కలిసి ఇంగ్లాండ్ వెళ్ళింది. అక్కడ చర్చ్ ఆఫ్ ఇంగ్లాండ్‌కు చెందిన సోదరీల పరిచయం వలన క్రైస్తవ్యాన్ని గురించి మరెన్నో విషయాలు తెలుసుకొంది. వారు వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న సంక్షేమ కార్యక్రమాల్ని, అక్కడ ఉంటున్న పతితలు, దౌర్భాగ్యులైన స్త్రీల జీవితాభ్యున్నతి కొరకెంతో త్యాగ నిరతితో చేయబడుతున్న సేవ ఆమెనెంతో ఆకట్టుకొన్నాయి. క్రీస్తును కలిగిన వారి జీవితాల్లోని మార్పు చూసిన ఆమె భారతదేశపు స్త్రీల దీనావస్థను క్రీస్తు ప్రభువే మార్చగలడని నిర్ధారించుకొన్నది.

ఏ ప్రభువు గురించి ఇంతకాలం వింటున్నదో ఆ ప్రభువు అడుగు జాడల్లో నడవాలని నిశ్చయించుకొని చర్చ్ ఆఫ్ ఇంగ్లాండ్ సంఘంలో బాప్తీస్మం తీసుకొంది. క్రీస్తును సంపూర్ణంగా ఎరుగక, రక్షణానందం, అనుభవం లేనందున తన ఈ నూతన జీవితంలో వెలితిననుభవిస్తూనే ఉంది. ఇంగ్లాండ్ నుండి అమెరికా వెళ్లి అనేక సభల్లో పాల్గొని తిరిగి భారతదేశం చేరుకున్నదామె. ఆ సమయంలో తన ఆత్మీయానుభవం గురించి చెబుతూ "క్రైస్తవ మతాన్ని ఎరిగాను గాని, ఆ మతానికి జీవనాడియైన క్రీస్తును నేనెరుగలేదని" తెలిపింది. తన ఆత్మీయ జీవితపు అసంతృప్తిని తొలగించుకోవడానికి శ్రద్ధగా బైబిల్ చదవడం ప్రారంభించింది. పరిశుద్ధాత్మ కృపవలన దైవ వాక్యం ద్వారా క్రీస్తు ప్రభువును తన స్వరక్షకునిగా అంగీకరించి రక్షణానుభవం పొందింది.

## శారదా సదన్

క్రీస్తు ప్రభువు నెరిగిన రమాబాయి ఆయనను సేవించగోరినది. ప్రతి అవసరం నిమిత్తం ప్రభువు పైన ఆధారపడి విశ్వాసమే పునాదిగా దేవుని సేవ చేయాలని ప్రేరేపించబడింది. ఆనాటి భారతదేశపు బాల వితంతువుల, బాలికల పాపభూయిష్టమైన హీన జీవిత స్థితిగతులను మార్చి, వారి అభ్యున్నతి కొరకేదైనా చేపట్టాలనే ఆశతో, పూనాలో శరణాలయాన్ని ప్రారంభించింది. సమాజంచే వెలివేయబడి, తృణీకరింపబడిన దీన దరిద్ర స్త్రీలందరిని తన శరణాలయంలో చేర్చుకొనేది.

ఎద్దుల బండిలో పరిసర గ్రామాలకు వెళ్లి వారికి క్రీస్తు రక్షణ సందేశాన్ని బోధించటమే గాక, పేద ప్రజలకు ఆహారాన్ని, దుస్తుల్ని పంపేది. హిందూ దేవాలయాల్లోని దేవదాసీలను విడిపించి, ఆశ్రయమిస్తున్న కారణంగా పూజారులామెను వ్యతిరేకించేవారు. ఆమె చేసే సేవ క్రమేణా భారతదేశంలోను, విదేశాల్లోను ప్రాచుర్యం పొందినది. సరోజినీ నాయుడులాంటి దేశ నాయకులామెను భారతీయ స్త్రీలలో పేరు గాంచినదిగా శ్లాఘించారు.

## ముక్తి

రమాబాయి చేస్తున్న సేవ విస్తరించినందున, శరణాలయంలో స్థలం చాలనందున పూనా సమీపంలోనున్న ఖేద్రా గాం వద్ద మరొక భవనంను ఎంతో ప్రార్థనా పూర్వకంగా నిర్మించి దానికి విమోచన అనే అర్థమిచ్చు 'ముక్తి'అని పేరు పెట్టింది. ముక్తిలో శిక్షణ పొందిన స్త్రీలెందరో బైబిల్ టీచర్స్‌గా, నేత, తోటపనుల్లో నిపుణురాళ్ళుగా, గృహిణులుగా సమాజంలో గౌరవనీయ జీవితం గడుపుతున్నారు.

## ధన్యురాలు

తాను ప్రారంభించిన శరణాలయాల్లో రెండువేల మందికి పైగా బాలికలు, స్త్రీలు, వారి నిర్వహణకై నూరుమందికి పైగా ఉన్న సేవికలతో, ఆ సంస్థ లెంతో అభివృద్ధి చెందాయి. 1922 సంవత్సరం తన జీవిత యాత్రను ముగించిన ఆమెను భళా! నమ్మకమైన దాసురాలా అని ప్రభువే తన సన్నిధికి చేర్చుకొని ఉంటాడనడంలో సందేహంలేదు. ఆమె మరాఠీ భాషలో రాసిన క్రైస్తవ భక్తి గీతాలు ఈనాటికీ వాడుకలోనున్నాయి. ఆమె స్థాపించిన ముక్తిసంస్థ నిరాశ్రయులై, పతితలుగా ముద్రవేయబడిన అభాగ్యులకెందరికో ఆశ్రయమిచ్చి ప్రయోజనకరమైన జీవితాల నేర్పరచుకొనేందుకు దోహదం చేస్తుంది.

"నీకున్నదొకే జీవితం అదైనా క్షణికం,
క్రీస్తు కొరకేమి చేశావో అదే శాశ్వతం!"

– కత్తి ఎజ్రి స్వామి, రైల్వే కోడూరు



కథానిక

# నిజమైన స్వాతంత్ర్యం

"ఆగష్టు పదిహేను నేడేనోయ్... అందరికీ స్వరాజ్య మిదియేనోయ్.." ఎక్కడ నుంచో పాట వినిపిస్తోంది. వీధిలోని పిల్లలంతా కేరింతలు కొడ్తూ ఉత్సాహంగా అటూ ఇటూ పరిగెడుతున్నారు. ఆ వీధిని ఆనుకొని ఉన్న బాయ్స్ హాస్టల్లోని విద్యార్థులంతా మేడపై నుంచి కింద జరుగుతున్న తంతును చూస్తూ మొబైల్ ఫోనులకి అంకితమై పోయారు. కాసేపటికి ఎవరో ఒక ముఖ్య అతిథి వచ్చి జెండా ఎగరేసి ప్రసంగం చేశాడు. మిఠాయిలు పంచిపెట్టారు. ఆ ఒక్కరోజు జెండాలా రెపరెపలాడిన దేశం మరుసటిరోజు నుంచి యథావిధిగా మారిపోతుంది.

హాస్టల్ గేట్ ముందు బైక్ ఆగడంతో వంగి కిందకి చూశాడు కిషోర్. బ్యాగ్స్ తగిలించుకొన్న ఇద్దర్ని గేట్ దగ్గర నుంచి వందనాలతో లోపలికి ఆహ్వానిస్తున్న స్నేహితుణ్ణి చూశాడు. చప్పున ఏదో గుర్తొచ్చిన వాడిలా పిట్టగోడ మీద కూర్చున్నాడు. మైక్‌లో నుంచి స్వాతంత్ర్యం పాట వినిపిస్తూనే ఉంది. దేశాన్ని భౌతిక బానిసత్వం నుంచి విడిపించిన మహనీయులందర్నీ కొనియాడుతున్న ఆ పాటను వింటూ కిందకి దిగాడు కిషోర్.

***

"తమ్ముడూ! మన ఇష్టానుసారంగా జీవించడమే స్వేచ్ఛకు నిర్వచనంగా మార్చుకొన్నాం. దేవుని వాక్యంలో నిలిచి నిజమైన శిష్యులుగా జీవించడమే స్వాతంత్ర్యమని తెలుసుకోలేక పోతున్నాం. స్వేచ్ఛంటే పవిత్రత అనీ, పాపికొరకు ప్రాణం పెట్టిన ప్రియ ప్రభు పరిశుద్ధ మార్గమనీ గుర్తించలేకపోతున్నాం. సాతాను మార్గాన్ని విడిచిపెట్టి సరైన మార్గాన్ని అన్వేషించడంలో విఫలం చెందుతున్నాం. పాపాల్ని వదిలిపెట్టలేక, పరిశుద్ధతతో జీవించలేక, ఏ మార్గం క్షేమమో తెలుసుకోలేని అయోమయంలో బతుకుతున్నాం. 'అన్నీ చేయడానికి నాకు స్వాతంత్ర్యముంది గానీ అన్నీ చేయదగినవి కావు' అనే విషయాన్ని మర్చిపోతున్నాం. సాతానుకి బానిసగా, వస్తువుల్ని ప్రేమించే వ్యక్తులుగా బతుకుతున్నాం గానీ పాపపు బానిసత్వం నుంచి విడిపించిన ప్రభువును గుర్తెరగకుండా జీవిస్తున్నాం" భరత్ ఉపన్యాసం గాలిలో తేలివచ్చి కిషోర్ చెవులను తాకింది.

అన్యమనస్కంగానే లోపలికి ప్రవేశించి అందరితో పాటు కూర్చున్నాడు కిషోర్. కళ్ళప్పగించి చూస్తున్నాడే గానీ హృదయాన్ని వాక్యానికి అప్పగించలేకపోతున్నాడు. 'ప్రతీవారం అన్న వస్తాడు, కాసేపు వచ్చి కూర్చో' అని చెప్పే స్నేహితుడి వైపు చూశాడు. తన రాకకు ప్రతిగా చిరునవ్వు నవ్వుతున్న స్నేహితుణ్ణి చూసి చూపు పక్కకు తిప్పుకొన్నాడు. వాడికెందుకు తనమీద అంత బాధ్యతో తెలియదు. వచ్చేదాకా వదిలిపెట్టడు. తననిక్కడ

కూర్చోబెడితే వాడికేం వస్తుందో కూడా తెలియదు. తను రానని చెప్పినా బలవంతం చేసి అయినా ప్రార్థనకు వచ్చేలా చేస్తాడు. వెళ్ళి కూర్చోవడం పెద్దగా ఇబ్బంది కాదు కనుక అయిష్టంగానైనా కూర్చుంటాడు.

ఆలోచనలకు స్వస్తి చెప్పి వాక్యం వైపు చెవులప్పగించాడు. వాక్యం వింటుంటే మనసులో ఏదో అపరాధ భావన కదలాడసాగింది. గడిపిన పాప జీవితపు తెరలు కళ్ళముందు మెదలసాగాయి. భరత్ చెప్తున్న వాక్యం బలంగా లోతుగా హృదయాన్ని తాకడం కిషోర్‌కి తెలుస్తూనే ఉంది. ఏవో అస్పష్టపు నీలినీడలు కమ్ముకుని కాసేపు అయోమయంలో తేలాడాడు.

'నేను పాపినే కదా? నేను బానిసత్వంలోనే జీవిస్తున్నానా? నేను కల్పించుకొన్న కృత్రిమ వాతావరణమంతా నన్ను పాపంలోకి ఈడ్చుకొని పోతోందా?' ఒకదాని తర్వాత ఒకటిగా వస్తున్న ప్రశ్నల ధాటికి కాసేపు సతమతమయ్యాడు. అప్రయత్నంగా కళ్ళల్లో చెమ్మ చేరింది. కళ్ళముందు గత జీవితం కదలాడింది.

❄❄❄

పుట్టడం మనకు తెలియదు. పోవడం మనకు తెలియదు. కానీ మధ్యలో బతికే జీవితమంతా మనకు తెలుస్తూనే ఉంటుంది. ఏది మంచో ఏది చెడో ఎలా బతకాలో ఎలా బతకకూడదో పూర్తిగా మన చేతుల్లోనే ఉంటుంది.

పదో తరగతిలో చిన్నగా అల్లుకొన్న పాపపు సంకెళ్ళు ఇంటర్మీడియట్ చదువుకోసం హాస్టల్లో చేరిన తర్వాత మరింత బిగుసుకుపోయాయి. విచ్చలవిడిగా బలాదూర్‌గా తిరగడం, దారిలో కనిపించిన అమ్మాయిల్ని కామెంట్ చేయడం, బద్ధకం, చేయాల్సిన పనుల్ని సకాలంలో పూర్తి చేయకపోవడం, పెద్దల్ని ఎదిరించి మాట్లాడడం, కాలేజీకీ బంక్ కొట్టడం, బ్యాక్ లాగ్స్ పెట్టుకోవడం.. ఇవన్నీ కిషోర్ దృష్టిలో పాపంగా అనిపించలేదు. నేరంగా కనిపించలేదు. అలా చేయకపోవడమే పెద్ద నేరంగా అనిపించేది. మడి కట్టుకుని కూచుంటే స్నేహితుల దృష్టిలో చేతకానివాడు, సరదా తెలియనివాడు! యవ్వనంలో తన వయసు వారితో కలిసి ఎంజాయ్ చేయడం పెద్ద నేరంగా తోచలేదు. అసలు దేవుడున్నాడనీ, తన కొరకు భూమ్మీదకొచ్చి ప్రాణం పెట్టి తిరిగి లేచాడనే స్పృహ కూడా ఎప్పుడూ కలగలేదు. క్రిస్మస్ పండక్కి చర్చ్‌కెళ్ళి కొవ్వొత్తులు వెలిగించి ఫలహారం పెడితే తిని రావడమే తప్ప అసలెప్పుడూ వాక్యం మీద కిషోర్ ధ్యాస పెట్టలేదు. సందర్భానుసారంగా చెప్తున్న వాక్యం వినకుండా వెనకున్న స్నేహితులతో కలిసి పాస్టర్స్ మీద ఎన్నిసార్లు కామెంట్స్ చేయలేదు?

అయినా అవి పాపమని, ఇన్నేళ్ళుగా తాను ఇష్టానుసారమైన బానిసత్వంలో బతుకుతున్నట్లుగా అనిపించలేదు. కానీ ఇప్పుడేంటో వాక్యం తనను తరుముతోంది. తను చేసిన పనుల్ని వేలెత్తి చూపిస్తూ 'ఇది తప్పు, ఇది ఒప్పు' అని చూపిస్తోంది. ఇన్నాళ్ళూ నడిచిన దారిలో కనబడని ముళ్లను కళ్ళముందు నిలుపుతోంది. స్వేచ్ఛ పేరుతో వేసిన వేషాలు, స్వాతంత్ర్యం అనుకొని చేసిన పనులన్నీ కళ్ళముందు కదలాడాయి.

ఆలోచనలో నుంచి బయటకు వచ్చి భరత్ వైపు చూశాడు కిషోర్. "యేసులో ఉన్న ఆనందాన్ని గుర్తించకుండా లోకంలో ఉన్న ఆనందాల్ని సొంతం చేసుకోవాలని పాపంలో పడిపోతున్నారు. 'నేనే మార్గమును, సత్యమును, జీవమును' అని చెప్పిన యేసుప్రభువులోనే ఆనందముంది. స్వాతంత్ర్యముంది. అటువంటి సత్యాన్ని అనుసరిస్తేనే నువ్వు నిజమైన స్వాతంత్ర్యాన్ని పొందినట్లు. కాబట్టి తమ్ముడా! మోసం చేసే లోకాశలను, లోకం కల్పించిన భ్రమల నుంచి బయటపడి నిత్యమైన సత్యమార్గాన్ని వెంబడించడం నేర్చుకో! అప్పుడే నీవు నిజమైన స్వాతంత్ర్యాన్ని అనుభవిస్తావు. పాపం నుంచి విమోచింపబడినప్పుడే నీకు నిజమైన స్వాతంత్ర్యం".

ప్రవాహంలా సాగిపోతున్న భరత్ ప్రసంగం కిషోర్‌లో పశ్చాత్తాపాన్ని కలిగించింది. స్వేచ్ఛకు కొత్త అర్థం తెలిసింది. నిజమైన స్వాతంత్ర్యమంటే ఏంటో అనుభవంలోకి వచ్చింది. తనలాంటి ఒక్కడు యేసులో నిజమైన స్వాతంత్ర్యాన్ని అనుభవిస్తే, ఆ వెలుగులో ఎంతోమంది నశించిపోతున్న విద్యార్థులు నిజమైన స్వాతంత్ర్యాన్ని పొందుకుంటారు. 'బాధ్యత లేకపోవడమే స్వేచ్ఛ' అని ఇన్నాళ్ళూ తను భ్రమించాడు. కానీ నిబద్ధతతో, బాధ్యతతో క్రీస్తును తెలుసుకొని సేవించడమే స్వాతంత్ర్యం అనే విషయం గ్రహింపులోకి వచ్చింది. కిషోర్‌లో నిజమైన ఆనందం ప్రవేశించింది.

**– డా. జడా సుబ్బారావు,** నూజివీడు





# చింతించడం

## అల్ప విశ్వాసి లక్షణం

ఆందోళన అనేది మన తరంలో ఒక మానసిక మహమ్మారి. చింత అంటే మనసులో అశాంతి, విచారం, వేదన, వ్యాకులం. దేనికోసమో ఆరాటంగా, ఆత్రుతగా అనిపించడం. "వర్రీ"(చింతించటం) అనే ఆంగ్ల పదానికి అర్థం "గొంతు నొక్కడం". "చింత తరచుగా చిన్న విషయానికి పెద్ద నీడను ఇస్తుంది" స్వీడిష్ సామెత.

చింతలకు అసలు కారణం పాపమని, మానవ పాపము మనిషిని భయాందోళనలతో నింపి నెమ్మది లేకుండా చేసిందని బైబిల్ బోధిస్తుంది. చింతించడానికి విశ్వాసులు కూడా అతీతులు కారు. పైపెచ్చు ఇంకా ఎక్కువ సమయం చింతిస్తూ నిరాశ నిస్పృహలతో సతమతమవుతూ ఉంటారు. "దేవునికి, దేవుని చిత్తానికి వ్యతిరేకంగా ఉన్న వాటిపై మన ఆశలు కేంద్రీకృతమై ఉన్నప్పుడు ఆందోళన సహజ ఫలితం" అని బిల్లీ గ్రాహం అంటారు.

చింత మనశ్శాంతిని, ఆనందాన్ని హరించివేస్తూ భయాందోళనతో ఊపిరాడకుండా చేస్తుంది. చింత మనల్ని మానసికంగా, భావోద్రేకంగా, ఆధ్యాత్మికంగా, శారీరకంగా ప్రభావితం చేస్తుంది. "ఆందోళన రక్త ప్రసరణ, గుండె, గ్రంథులు, మొత్తం నాడీ వ్యవస్థను ప్రభావితం చేసి ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుంది" అని డాక్టర్ ఛార్లెస్ మాయో చెప్పాడు. అనేక ఆందోళన రుగ్మతలు, కాన్సర్ కూడా వస్తాయి. చింత మనిషి సామర్థ్యాన్ని దెబ్బతీసి అచేతనంగా చేస్తుంది. జీవించాలనే ఆశను చంపి, నిరాశతో నింపి జీవచ్ఛవాలుగా చేసి చంపుతుంది.

మానవులందరూ చీకు, చింత లేని ఆనందమయ జీవితాన్ని కోరుకొంటారు. చింత నుంచి బయట పడాలని, అసలు చింత దరి చేరకుండా ఉండాలని శత విధాలా ప్రయత్నిస్తారు. కొంతమంది మోటివేషనల్ స్పీకర్స్ అయితే, "చింతలేని జీవితం కావాలా? చింతను ఎదుర్కొనే చిట్కాలు అని చెబుతూ, డోంట్ వర్రీ" అని అంటారే గాని వర్రీని తొలగించలేరు.

యేసుక్రీస్తు కొండమీది ప్రసంగంలో చింత, ఆందోళన ఒక సాధారణ సమస్యగా గుర్తించి దేవుని బిడ్డలు/శిష్యులు చింతను అధిగమించగల బోధను చేశారు. మత్తయి 6:25-34 వాక్య భాగంలో మూడుసార్లు, "చింతించవద్దు" అని ఆజ్ఞాపిస్తూ ఎందుకు చింతించకూడదో కారణాలు చెప్పారు. మొదటిది, ఆందోళన వల్ల ఎలాంటి ఉపయోగం లేదు (వ 27). రెండవది, ఆందోళన విశ్వాసులను అవిశ్వాసుల్లాగా ప్రవర్తించేలా చేస్తుంది (వ 30). మూడవది, విశ్వాసులను పోషించి అవసరాలు తెలిసి తీర్చే పరమ తండ్రి ఉన్నాడు (వ 32,33). నాలుగవది, ఆందోళన చెందడం, మనల్ని మనం హైరానా పెట్టుకోవడం దేవుణ్ణి అగౌరవపరచడమే తప్ప వేరొకటి కాదు. "నా పరమ తండ్రి నా గురించి శ్రద్ధ తీసుకొనే సామర్థ్యం లేనివాడు లేదా ఆయనకు అది ఇష్టం లేదు" అని అనుకోవడంతో సమానం.

మనం సాధారణంగా చింతను విశ్వాసలేమిగా భావించం. చింతించే వ్యక్తిని యేసు, "ఓ అల్ప విశ్వాసి" అన్నాడు. అల్ప విశ్వాసం అంటే విశ్వాసం బొత్తిగా లేకపోవడం కాదు. కొందరికి పాపక్షమాపణ, శాశ్వత జీవం పొందగలిగే నమ్మకం ఉంటుంది గానీ తమ ఆందోళనలను, భయాలను జయించే నమ్మకం ఉండదు. దేవుడంటే నమ్మకం లేనివారు ఏమి తిందుమో, యేమి తాగుదుమో, యేమి ధరించు కొందుమో అని విచారిస్తారు. విశ్వాసులు దీనికి భిన్నంగా ఉండాలని దేవుడు కోరుతున్నాడు. వారు నమ్మకం గల, ఆనందం గల ప్రత్యేక ప్రజగా, ఆధ్యాత్మిక విషయాలను అనుసరిస్తూ ఉండాలని కోరుతున్నాడు. ఎందుకంటే మనము దేవునికి విలు వైన వారము, శ్రేష్టులము. కాబట్టి చింతించడమంటే దేవుని మాటను, మార్గాన్ని విస్మరించడం. అవిధేయత కూడా.

మన చింత యావత్తు ఆయనమీద వేయాలి ఎందుకంటే ఆయన మన గూర్చి చింతించుచున్నాడు (1పేతురు 5:7; కీర్తన 55:22). చింత ఉండదని దేవుడు చెప్పడం లేదు. కష్టాలు, బాధలు కలుగుతాయి. అయితే, రేపటి గూర్చి చింతించకుండా, ఏ రోజుకా రోజు దేవునిపై నమ్మకంతో జీవించాలని, ప్రార్థించాలని, దేవుని వాక్యాన్ని ధ్యానించాలని మాత్రం చెబుతున్నాడు. చింతలేదిక యేసు చెంతనుండగ అంటూ ప్రతిరోజూ మన ఆందోళనను ఆరాధనతో రీప్లేస్ చేయాలి.

– డా.జే. రత్న గ్రేస్, వైజాగ్

## కోశాధికారి లేఖ

# పరిచర్యలో పాల్గొందాం!

క్రీస్తునందు ప్రియమైన యుఇయస్ఐ-ఏపిలోని కోశాధికారులందరికి, సభ్యులకు
మన ప్రభువును రక్షకుడునైన యేసుక్రీస్తు నామములో శుభాకాంక్షలు.

క్రీస్తునందు అతి ప్రియమైన యుఇయస్ఐ-ఏపి కుటుంబ సభ్యులకు, కోశాధికారులకు, ప్రార్థనా సహకారులకు మన ప్రభువైన యేసుక్రీస్తు నామములో వందనాలు. దేవుని ప్రణాళికలో యుఇయస్ఐ-ఏపి కోశాధికారిగా ఉండడానికి అవకాశమిచ్చిన దేవునికి, ఎగ్జిక్యూటివ్ కమిటీ వారికి నా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. మన తండ్రియైన దేవుని నుండియు, మన ప్రభువైన యేసుక్రీస్తు నుండియు మీకు కృపయు సమాధానమును కలుగును గాక! (గలతీ 1:1-3).

దేవుడు తన అనాదికాల సంకల్పములో మన దేశంలో నశించిపోతున్న కళాశాల విద్యార్థులను రక్షించుకోవడం కోసం యుఇయస్ఐ అనే ఈ మహా ఉద్యమాన్ని లేవనెత్తాడు. మన పితరుల నిలకడ, పట్టుదల, ఎడతెగని ప్రార్థనలు, త్యాగం ఫలితంగా నేడు భారతదేశమంతా ఈ పరిచర్య వ్యాపించింది. ప్రభువే ఈ పరిచర్యకు ఆధారం మరియు కేంద్రం. మన పరిచర్యలో విద్యార్థులను, గ్రాడ్యుయేట్స్‌ను, స్టాఫ్‌ని త్రిభుజంలో మూడు భుజాల మాదిరిగా ఉంచారు. ఈ పరిచర్య ద్వారా అనేకమంది విద్యార్థులను ప్రభువుకోసం గెలవాలంటే పరిచర్యలో మూడు భుజాలైన మనమందరం విధిగా ప్రార్థించి, తప్పక పాల్గొనాలి. పాల్గొనడమంటే మన సమయం, ధనం, తలాంతులు ప్రభువు పని కోసం వినియోగించాలి. ఇప్పటివరకు మీ సమయం, ధనం, తలాంతులను ప్రభువు పనిలో వినియోగించినదాన్ని బట్టి మీకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. అయితే మన ముందు దేవుని పని ఎంతో ఉంది. దానికి అనుగుణంగా, గతంలో కంటే వీటిని మరెక్కువగా వినియోగిస్తూ విద్యార్థుల పరిచర్యలో పాల్గొంటూ, పితరులవలె ప్రయాసపడదాం. గతనెలలో జరిగిన యాన్యువల్ కౌన్సిల్ మీటింగ్‌ను బట్టి దేవుని స్తుతిస్తూ దానిలో తీసుకొన్న నిర్ణయాలకు అనుగుణంగా మనం ముందుకు వెళదాం.

**స్తుతించండి**

1. మన స్టాఫ్‌కు 100% శాలరీ, అలవెన్స్‌లు ఇవ్వడానికి ప్రభువు చూపిన కృపను బట్టి
2. స్టాఫ్‌కు ఒక ల్యాప్‌టాప్ ఇవ్వడానికి వచ్చిన రూ. 20,000/- ను బట్టి

**ప్రార్థించండి**

1. యుఇయస్ఐ-ఏపి ఏసియం-2023 తర్వాత పెరిగిన 18% బడ్జెట్‌కు అనుగుణంగా ఇజియఫ్‌లు కాంట్రిబ్యూషన్స్ పెంచి పంపేటట్లు
2. స్టైరెట్ బ్లాక్ రిపేర్ వర్క్స్ కోసం 8 లక్షలు, చాందపిళ్ళ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ రిపేర్ వర్క్స్ కొరకు 5 లక్షలు అవసరం
3. యుఇయస్ఐ నేషనల్ వేతన సవరణలకు అనుగుణంగా మన స్టాఫ్‌కు కూడా వేతనాలు పెంచడానికి ఏసియం 2022 నిర్ణయించింది. దీని అవసరత ప్రతి నెల రూ. 70,000/- పెరుగుతుంది.
4. స్టాఫ్‌కు ఐదు ల్యాప్‌టాప్‌లు సబ్సిడీలో ఇవ్వడానికి అవసరమైన 1,00,000/- కొరకు

ఇట్లు
క్రీస్తులో మీ సహోదరుడు
**యస్.ఆర్.డి. కిషోర్ కుమార్**

**MINIMUM MONTHLY NEED OF UESI AP: RS.13,87,000/- (AS PER THE ACM 2023)**
**Minimum amount to be sent to UESI every month: Rs.4,50,000/-(as per the ACM'23)**
**Total need for the month of June 2023: Rs.18,37,000/-**

**JUNE - 2023**

| Receipts | | Payments | |
|---|---|---|---|
| Opening Balance | --- | Field Staff Salaries | 5,25,903.00 |
| General Fund | 14,85,447.00 | Field Staff HRA, CA, MA & TA | 2,70,849.00 |
| Staff Support | 44,100.00 | Office Staff Salaries | 1,68,085.00 |
| Adjusted from other funds (2.85%) | 45,000.00 | UESI | 4,50,000.00 |
| | | Rajasthan | 30,000.00 |
| | | Jammu & Kashmir | 15,000.00 |
| | | APEGF | 3,000.00 |
| | | Girls Depatment | 3,500.00 |
| | | To Gratuity | 50,000.00 |
| | | Other Expenditure | 58,210.00 |
| **Total** | **15,74,547.00** | | **15,74,547.00** |

**Note:**
1. Rs.45,000/- less was received than the actual expenditure for the month of June 2023 which is 2.85%
2. Rs. 10,90,383/- is received as on 20/07/2023 againast the total need of Rs.18,37,000/- for the month of July 23 which is 59.36% only
3. Projected Budget for the month of August 23 Rs. 18.37 Lakhs
4. Percentage of hike that all the EUs & EGFs are requested to do for their last year's monthly contribution: 17.95%

Registered with the Registrar of News Papers of India **RNI No. 52991/94**
Postal Registration No. : **GTR/59/2021-2023**

**Date of Printing: 25-07-2023**
**Date and place of posting: 27th and 28th of every month at GUNTUR RMS**

Printed at Bhashyam Publishers, Amaravathi Road, Guntur 522 007. by Mr. P. Basavaiah
Edited by Mr. B.J. Lazarus and published by UESI-AP, Nambur - 522 508



# ఇంకెందుకు ఆలస్యం?



నిరాశతో కొందరు
నిట్టూర్పులతో కొందరు
నీకేమీ చెప్పలేక
నిన్నేమీ అడగలేక
మనసు లోతుల్లో కుంగిపోతూ
మరణం అంచులదాకా వెళ్తూ...
ఒక్కసారి చూడు
నీ చుట్టూ చూడు
అందరూ దేవుని సృష్టే
సృష్టికర్తకు ఇష్టమైన వారే!

సమాధానం కరువై
సమాధులే నిలయమై
జీవచ్ఛవాలుగా జీవించలేక
జీవంతో ఉండాలని లేక
తమ్మును తాము హింసించుకుంటూ
చావుకోసం తావు వెతుకుతూ
పరుగు తీయలేక
పరువు నిలుపుకోలేక...
ఒక్కసారి చూడు
నీ చుట్టూ చూడు
వారు కూడా దేవుని పోలికే
వారు కూడా విలువైన వారే!

ఒంటరి తనంతో
ఓటమి భయంతో
వ్యథల నుంచి పారిపోలేక
వ్యసనాల నుంచి బయటపడలేక
అవమానపు వాకిట్లో
నిరాశా చీకట్లో
మనసుల్లో తలవలేక
మనుషుల్లో కలవలేక...
ఒక్కసారి చూడు
నీ చుట్టూ చూడు
సిలువ రక్తం వారికి కూడా
చాచిన హస్తం వారికోసం కూడా!

భారతదేశం నా మాతృభూమి
భారతీయులందరూ నా సహోదరులని
బల్లగుద్ది చెప్పడమేనా?
భారం తీర్చే ప్రభువుని
పరిచయం చేయడానికి
ఇంకెందుకు ఆలస్యం?
పరిష్కారం చూపడానికి
ఇంకెన్నాళ్ళు అలసత్వం?

– గొంగటి మేరి జాయ్, ఆదోని